@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
# మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
శుక్రవారం 28 ఆగస్టు 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# మరో ఘోరం



- పల్నాడులో ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఏడుగురు మృతి
- పుట్టిన రోజు వేడుకలకు ఆటోలో వెళ్లి వస్తున్న
- ఒకే గ్రామానికి చెందిన 15 మంది
- చిలకలూరిపేటలో ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
- మృతుల్లో ఆరుగురు మహిళలు..
- నలుగురు చిన్నారులు సహా 8 మందికి గాయాలు
- బాధితులంతా ఒకే గ్రామానికి చెందిన బంధువులు



## ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

- పుతిన్‌తో కీలక భేటీ
- భారత్, రష్యా సంబంధాలపై చర్చ
- నాలుగు రోజుల పాటు రెండు దేశాల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ
- బిష్కెక్‌లో 26వ షాంఘై సహకార సంస్థ సదస్సుకు హాజరు

## అందరినీ క్షేమంగా తేవడమే
# మన ప్రాధాన్యం

- కేంద్రం, ఎంబసీలతో టచ్‌లో ఉండండి: బాబు
- మానస సరోవర్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలి
- ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి
- కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదు



**అమరావతి**

నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసుల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. మానస సరోవర్ యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరి క్షేమం కోసం అన్ని మార్గాల్లో సమన్వయం చేయాలని గురువారం అధికారులను ఆదేశించారు. ఆచూకీ తెలియని వారి వివరాలను నిరంతరం ట్రాక్ చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో, భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలన్నారు. రహదారి, విమాన మార్గాలతో పాటు ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కష్టాల్లో ఉన్న ఏపీ వాసులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులకు - మిగతా3లో



## రూ.1,430 కోట్లతో అభివృద్ధి పనులు

- రూ.596 కోట్లతో లైబ్రరీ
- కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు
- సచివాలయంలో 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం

**అమరావతి**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 65వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో వివిధ పరిపాలన అనుమతులకు ఆమోదం లభించింది. రూ.596 కోట్లతో లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి, మొత్తం రూ.1,430 కోట్లతో క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎల్‌పీఎస్ రోడ్లను సీసీకి బదులుగా బీటీ రోడ్లుగా నిర్మించేందుకు, 29 గ్రామాల లేఅవుట్ రోడ్లను బీటీగా అభివృద్ధి చేసేందుకు ఆమోదం లభించినట్లు వివరించారు. అమరావతి నుంచి మంగళగిరికి తాగునీరు అందించేందుకు - మిగతా3లో



# వెలుగుల వెలిగొండ

- నెరవేరనున్న 30 ఏళ్ల కల.. కరువు నేలకు కృష్ణమ్మ
- ఈ నెల 31న ప్రాజెక్టు జాతికి అంకితం
- తీరనున్న మార్కాపురం జిల్లావాసుల కష్టాలు
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకూ లబ్ధి
- కరువు కాటకాలు, ఫ్లోరైడ్ సమస్యలకు చెక్
- అంచనా వ్యయం 10,200 కోట్లు
- సామర్థ్యం 53.85 టీఎంసీలు
- మొత్తం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు
- 23 లక్షల మందికి తాగునీరు సరఫరా
- 1996లో నాటి సీఎం చంద్రబాబు భూమిపూజ
- ఇప్పుడు ప్రారంభించేదీ ఆయనే
- ప్రాజెక్టు పనులను అపహాస్యం చేసిన వైసీపీ
- జగన్ పాలనలో 140 కోట్ల బిల్లులు పెండింగ్
- పైగా జాతికి అంకితం అంటూ మోసం



**అమరావతి**

మూడు దశాబ్దాల కల నెరవేరబోతోంది. కరువు నేలపై కృష్ణమ్మ పరవళ్లు తొక్కే సమయం ఆసన్నమైంది. తమ జీవితాల్లో వెలుగులు నింపే వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు ప్రారంభానికి సిద్ధం కావడంతో ప్రజల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది. ఇంతటి బృహత్తర ప్రాజెక్టు పూర్తి కావడానికి కారకుడు నాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు కావడం విశేషం. 1996లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం చంద్రబాబు.. ఈ నెల 31న జాతికి అంకితం చేయనున్నారు. ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తి కావడంతో కృష్ణమ్మ నీళ్ల నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తెచ్చే శుభ ఘడియల కోసం ప్రజానీకం ఎదురుచూస్తోంది. ప్రకాశం, మార్కాపురం, - మిగతా3లో



## భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

- 2036 ఒలింపిక్స్‌కు సిద్ధమవ్వాలి: మోదీ
- డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడల పాత్ర కీలకమని వ్యాఖ్య
- 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని పిలుపు

# నేపాల్ వరద విధ్వంసం

- 359కి చేరిన మృతుల సంఖ్య
- 288 మంది భారతీయలు గల్లంతు
- నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతైనట్లు తెలిపిన విదేశాంగ శాఖ
- టిబెట్‌లోని మరో 200 మంది భారతీయులు భారత్ సాయం కోరినట్లు వెల్లడి
- 359 మంది మృతి

**హైదరాబాద్**

నేపాల్‌లో ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య గంటగంటకూ పెరుగుతోంది. మృతుల సంఖ్య 359 దాటినట్లు నేపాల్ పోలీసులు ప్రకటించారు. 910 మంది ఆచూకీ గల్లంతైంది. గల్లంతైన వారిలో 288 మంది భారత పర్యటకులు ఉన్నారు. ఉప్పెనలా వరద, బురద ముంచెత్తడంతో వేలాది ఇళ్లు, పలు వంతెనలు నామరూపాల్లేకుండా పోయాయి. అనేక చోట్ల భారీ ఎత్తున బురద మేట వేసింది. సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో - మిగతా3లో

## పంచదార్ల కొండపైతవ్వకాలు బంద్!



- నో మైనింగ్ జోన్‌గా ప్రకటించిన ప్రభుత్వం
- ఆలయాల పరిరక్షణకు నిర్ణయం
- ఇప్పటికే ఇచ్చిన గ్రావెల్ లీజులు పనిచేయవు
- భవిష్యత్‌లోనూ అనుమతులివ్వరు
- ఉత్తర్వులు జారీచేసిన గనుల శాఖ

# ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ



ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిష్కెక్ నగరంలో ఎస్‌సీవో సదస్సుకు మోదీ హాజరవుతారు. చివరి రోజు ఆయన ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకల్లోనూ ఇతర ఎస్‌సీవో దేశాల నేతలతో కలిసి మోదీ పాల్గొంటారు. కిర్గిజ్‌స్థాన్ పర్యటనకు ముందు 29, 30 తేదీల్లో మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. పుతిన్?తో జరిగే భేటీలో భారత్?- రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు సమీక్ష నిర్వహించినున్నట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. అలాగే ఇతర దేశాల నేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆయా నేతల సమయానుకూలత, అందుబాటును బట్టి సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

**ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు మోదీ**

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళ్లనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి వెళ్లడం. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించనున్నారు. భారత్-ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు నేతలు చర్చించనున్నారు.

**దాదాపు 100 కోట్ల డాలర్ల వాణిజ్యం, పెట్టుబడులు**

భారత్-ఉజ్బెకిస్థాన్ మధ్య ఆర్థిక సంబంధాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాలు సహకరిస్తున్నాయి. ఉజ్బెకిస్థాన్‌లో ప్రస్తుతం 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు కూడా ఉన్నాయి. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు ఉన్నాయి.

**'వికసిత్ భారత్-2047'పై చర్చ**

మోదీ, మిర్జియోయెవ్ సమావేశంలో భారత్ ప్రతిపాదిస్తున్న 'వికసిత్ భారత్-2047', ఉజ్బెకిస్థాన్ అభివృద్ధి లక్ష్యం 'ఉజ్బెకిస్థాన్-2030' మధ్య సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగం, విద్య, అంతరిక్షం, సాంకేతికత, సంస్కృతి, వ్యాపార సంబంధాలు వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసే విందులోనూ ప్రధాని పాల్గొంటారు. ఎస్‌సీఓలో ప్రస్తుతం 10 సభ్య దేశాలు ఉన్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కాలక్రమేణా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీ, సాంకేతికత తదితర రంగాలకు కూడా సహకారం విస్తరించింది.

# భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా



యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడలు ఒక అద్భుతమైన ఆయుధంగా పనిచేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. క్రీడలు జీవితాలను ఎలా మార్చగలవో చెప్పడానికి మన పారా అథ్లెట్లు ఒక ఉదాహరణ అని, వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని అన్నారు. క్రీడల పట్ల తన దృక్పథం కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదని, దేశ నిర్మాణ ప్రక్రియలో వాటిని ఒక అంతర్భాగంగా మార్చడమేనని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్?లో మోదీ వర్చువల్?గా పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

"ఒలింపిక్స్‌లో అనేక రకాల క్రీడలు ఉంటాయి. కానీ భారతీయ జట్లు వాటిలో కనీసం సగం విభాగాల్లో కూడా పాల్గొనడంలేదు. ఇదొక చేదు నిజం. ఎందుకంటే, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 32 క్రీడా విభాగాలలో భారత్ కేవలం 16 విభాగాల్లో మాత్రమే పాల్గొంది. మొత్తం పతకాల సంఖ్యలో గణనీయమైన భాగానికి మనం పోటీనే పడటం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలు క్రీడల్లో పతకాలు సాధిస్తుంటే, మనం కనీసం వాటిలో పాల్గొనడం కూడా లేదు. పతకాల సంఖ్యను పెంచుకోవాలంటే సంబంధిత క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఇటీవల నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్?కు పతకాలు తెచ్చిపెట్టే బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్ వంటివి లేకపోవడం ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపించింది. మొత్తం 10 క్రీడలకు గాను ఆరు పారా-క్రీడా ఈవెంట్లలో మాత్రమే భారత్ పాల్గొంది. అయినప్పటికీ, 13 స్వర్ణాలు, 17 రజతాలు, తొమ్మిది కాంస్య పతకాలతో పాయింట్ల పట్టికలో భారత్? నాలుగో స్థానంలో నిలిచింది."

**'యువ ప్రతిభను గుర్తించాలి'**

ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని, అయితే, మైదానంలోకి అడుగుపెట్టకుండా ఆ స్ఫూర్తిని అలవర్చుకోవడం చాలా కష్టమని మోదీ అన్నారు. విజేతలుగా ఎలా నిలవాలో నేర్పడమే కాకుండా, మంచి పోటీదారులుగా ఎలా ఎదగాలో క్రీడల నుంచి నేర్చుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని మోదీ పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన ఒలింపిక్స్ పోటీల్లో భారత్? నుంచి చాలా తక్కువ జట్లు పాల్గొన్నారని చెప్పారు. "2036 ఒలింపిక్స్ భారతదేశంలోనే జరగాలని మేం నిర్ణయించుకున్నాం. ఈ నేపథ్యంలో వివిధ క్రీడాంశాలపై భారత్? దృష్టి సారించాల్సిన అవకాశం ఉంది. 2036 ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా, ముఖ్యంగా ప్రస్తుతం ఐదు, 10 లేదా 15 ఏళ్ల వయస్సు ఉన్న యువ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రతి గ్రామం, నగరం, పాఠశాలలో ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం" అని మోదీ తెలిపారు.

**'వారికి ప్రభుత్వ మద్దతు ఉంటుంది'**

అయితే, క్రీడల్లో పాల్గొనేందుకు అభ్యర్థులకు అవసరమైన మద్దతును ప్రభుత్వం తప్పక అందిస్తుందని మోదీ హామీ ఇచ్చారు. 21వ శతాబ్దపు ఆధునిక క్రీడా వ్యవస్థను (ఎకోసిస్టమ్) రూపొందించడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆ దిశగా క్రీడా విశ్వవిద్యాలయాల నుంచి ఆధునిక శిక్షణా కేంద్రాల వరకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 80 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రసంగంలో భారతదేశ క్రీడా భవిష్యత్తుపై తన దార్శనికతను వివరించారు. దేశ క్రీడా బలాన్ని యువ శక్తితో మేళవించి, దానిని దేశ నిర్మాణానికి మళ్లించడమే ప్రధాన లక్ష్యమని మోదీ పేర్కొన్నారు.

# 400 మందితో భారత్‌కు జిన్‌పింగ్



**న్యూఢిల్లీ :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 400 మంది అధికారుల భారీ ప్రతినిధి బృందంతో ఆయన రానున్నట్లు సమాచారం. 2020 నాటి సరిహద్దు వివాదాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. ఇది ఓ కీలక పరిణామంగా మారనుంది. అదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సరిహద్దు చర్చల నిమిత్తం బీజింగ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.బ్రిక్స్ సదస్సు కోసం షీ జిన్‌పింగ్ వెంట దాదాపు 400 మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నట్లు సమాచారం. 2019 నాటి పర్యటనతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం చైనా అధికారులు ఢిల్లీలో హోటళ్ల కేటాయింపులు, భద్రతా ప్రోటోకాల్‌లను ఆఖరి దశలో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సదస్సు కేవలం బ్రిక్స్ ఎజెండా కోసమే కాకుండా భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ సంకేతంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు షీ జిన్‌పింగ్ రాకపై సన్నాహాలు జరుగుతుండగానే.. మరోవైపు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లిన డోభాల్.. మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొని సుదీర్ఘ సరిహద్దు వివాదాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ ఈ తో కూడా ఆయన ద్వైపాక్షిక సమావేశం కానున్నారుభారత్-చైనా మధ్య హిమాలయ ప్రాంతంలో 3,800 కిలో మీటర్ల మేర సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత నాలుగేళ్ల మిలిటరీ సైనిక చర్చల ఫలితంగా 2024 అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరింది. అయితే జూలై చివర్లో సరిహద్దు వద్ద మళ్లీ సైనికులు ఎదురెదురుపడటంతో.. సరిహద్దుల్లో పూర్తి శాంతి పునరుద్ధరణే దౌత్య సంబంధాలకు ప్రాతిపదిక అని భారత్ ఇటీవల స్పష్టం చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన వాణిజ్య విధానాల నేపథ్యంలో.. భారత్, చైనా రెండూ బ్రిక్స్ వేదికగా పరస్పర సహకారాన్ని పెంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. షీ జిన్‌పింగ్ చివరి పర్యటన నిర్ణయం ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ.. బీజింగ్ మాత్రం భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.

## 'ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యనే మరో 25 ఏళ్లు పాటు కొనసాగించాలి'

### -డీలిమిటేషన్‌పై మోదీకి ఖర్గే లేఖ



దేశ రాజకీయాల్లో కీలకమైన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలతో పంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ప్రస్తుత లోక్?సభలోని సభ్యుల సంఖ్యను 25 ఏళ్ల పాటు యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలి. అంతేకాకుండా రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యలోనూ మరో 25 ఏళ్లపాటు మార్పులు చేయకూడదు. దీంతో పాటు 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ అమలు చేయాలి. డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ అంశం కూడా దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యమున్న అంశం. ప్రభుత్వం వద్ద ఉన్న డీలిమిటేషన్ ప్రతిపాదనలను అన్ని పార్టీలతో చర్చించాలి. వాటిని అధ్యయనం చేసేందుకు రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలి' అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. జులై 16న కూడా ఇదే అంశంపై ప్రధానికి లేఖ రాసినట్లు ఖర్గే గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని అప్పుడే కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి టీవీ ఇంటర్వ్యూలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని చెప్పడంతో మరోసారి ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి కీలకమైన అంశంపై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా విస్తృతంగా చర్చించాలని ఖర్గే కోరారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని అన్నారు. ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసినట్లుగా మరోసారి ఈ ప్రక్రియను బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించవద్దని ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు.

**మహిళా రిజర్వేషన్‌పైనా కాంగ్రెస్ పట్టుబట్టు**

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్? కల్పించాలన్న అంశాన్ని కాంగ్రెస్? గతంలోనూ ప్రస్తావించింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను పునరుద్ఘాటించాయి. డీలిమిటేషన్?కు సంబంధించిన అంశాలతో ముడిపెట్టి మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్న ప్రధాని విజ్ఞప్తిని కాంగ్రెస్ గతంలో విమర్శించింది. మహిళ రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించింది.

**ఏప్రిల్‌లో బిల్లుకు ఎదురుదెబ్బ**

2026 బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. వారిలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలోని ఓట్లలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం. అంటే 352 ఓట్లు రావాల్సి ఉండగా, అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక పార్లమెంట్ వర్షాకాల? సమావేశాలు నిరవధిక వాయిదా రెండు వారాలపైగా అవుతున్న ఇంతవరకు ప్రొరోగ్?పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి ప్రతిపాదన తీసుకొస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 'ఆపరేషన్ సిందూర్‌లో చైనా పాత్రపై గందరగోళం'

### - మాజీ జనరల్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు

ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా- పాకిస్థాన్ మధ్య సైనిక సహకారంపై మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు వర్షం కురిపించింది. గతంలో డిప్యూటీ చీఫ్? ఆఫ్? ఆర్మీ స్టాఫ్? లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు, తాజాగా అనిల్ చౌహాన్ చెప్పిన అంశాలకు పొంతన లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గతేడాది రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు, తాజాగా అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను జైరాం రమేశ్ ఎక్స్?లో షేర్ చేశారు. చైనా- పాక్ సైనిక సహకారంపై భిన్నమైన వాదనలు ఎందుకు వినిపిస్తున్నాయని ప్రశ్నించారు. 2025 జులై 4న లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా-పాకిస్థాన్ మధ్య ఉన్న సహకారం గురించి తీవ్రంగా ప్రస్తావించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అయితే 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఏం జరుగుతోంది కథనాన్ని మార్చేందుకు ఏదైనా లోతైనా ప్రణాళిక ఉందా దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. చైనాతో సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కూడా ఆయన విమర్శలు చేశారు. చైనా విషయంలో మోదీ ప్రభుత్వం రాజీ ధోరణిని అనుసరిస్తోందా? అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

**'చైనా పాక్‌కు అన్ని విధాలా సహకరించింది'**

2025లో లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. మే 7 నుంచి 10 వరకు భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణను చైనా ఆయుధ వ్యవస్థలను పరీక్షించుకునే 'లైవ్ ల్యాబ్'గా ఉపయోగించుకుందని ఆయన అప్పట్లో వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు చైనా అన్ని విధాలా మద్దతు అందించిందని, తుర్కియే కూడా ఆయుధ సామగ్రిని సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. పాక్ ముందుండి పోరాడుతున్నప్పటికీ, చైనా, తుర్కియే మద్దతుతో భారత్ ఒకేసారి కనీసం ముగ్గురు ప్రత్యర్థులను ఎదుర్కొందని తెలిపారు. పాకిస్థాన్ సైన్యానికి చైనా ఉపగ్రహాల ద్వారా భారత సైనిక మోహరింపులపై సమాచారం అందిందని కూడా రాహుల్ సింగ్ అప్పట్లో పేర్కొన్నట్లు గుర్తు చేశారు.

అయితే తాజాగా అనిల్ చౌహాన్ దీనిపై భిన్నమైన వివరణ ఇచ్చారు. పాకిస్థాన్ వద్ద ఉన్న సైనిక ప్లాట్?ఫామ్?ల్లో దాదాపు 70 నుంచి 80 శాతం చైనా తయారీకి చెందినవేనని తెలిపారు. విదేశీ ఆయుధ వ్యవస్థలను ఒక దేశం కొనుగోలు చేసినప్పుడు వాటి నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవల కోసం ఆయా తయారీ సంస్థల ప్రతినిధులు అక్కడ ఉండటం సాధారణమేనని వివరించారు. యుద్ధ సమయంలో ఆయుధ వ్యవస్థలు పనిచేసేలా చూసే బాధ్యత ఆయా సంస్థలపై ఉంటుందని చెప్పారు. పాకిస్థాన్‌లో చైనా ఆయుధ తయారీ సంస్థల ప్రతినిధులు ఉండటం విషయాన్ని చైనా కూడా అంగీకరించిందని, ఇందులో కొత్త విషయం ఏమీ లేదని చౌహాన్ అన్నారు. ఇదే విధంగా భారత్‌లోనూ రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్‌కు చెందిన ఆయుధ సంస్థల ప్రతినిధులు తమ పరికరాల నిర్వహణ కోసం ఉండే అవకాశం ఉందని వివరించారు.

# మరో ఘోరం

**చిలకలూరిపేట/బెళుగుప్ప** వారందరిదీ ఒకే గ్రామం.. అంతా బంధువులు. చిన్నారి పుట్టినరోజు వేడుకకు వెళ్లారు. రోజంతా సంతోషంగా గడిపారు. ఆనందంగా పుట్టినరోజు వేడుక చేసుకున్నారు. ఆ తర్వాత ఆటోలో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. కాసేపట్లో గ్రామానికి చేరుకోవాల్సిన సమయంలో ఊహించని ఘోరం జరిగింది. ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన చవుటుపల్లి లక్ష్మమ్మ చెల్లెలు పలకలూరు సుబ్బులమ్మ ప్రకాశం జిల్లా జే పంగులూరు మండలం కొండ మంజులూరులో ఉంటోంది. సుబ్బులమ్మ మనవడు మరియబాబు కుమార్తె నక్షత్ర తొలి పుట్టినరోజు వేడుకలు బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ వేడుకకు వేలూరు నుంచి బంధువులు 15మంది ఆటోలో వెళ్లారు. రాత్రి పొద్దుపోయే వరకు వేడుకలో పాల్గొన్నారు. విందు భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. చిలకలూరిపేటకు చేరుకుని.. పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్ నుంచి వేలూరు వెళ్లేందుకు ఆటో మలుపు తిరుగుతుండగా విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న వరుణ్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. బస్సు బలంగా ఢీకొట్టడంతో ఆటోలోనివారు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుల్లో చవుటుపల్లి లక్ష్మమ్మ(75), ఆమె కోడలు సువార్త(45), కుమార్తె బొంతా గంగమ్మ(50), భార్యాభర్తలు బొంత బాబురావు(62), మణెమ్మ (55), వరుసకు అత్తా కోడళ్లు బొంత సంపూర్ణమ్మ (70), బొంత మరియమ్మ(50) ఉన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు చిన్నారులు బొంత పల్లవి, తాళ్లూరి అభిరామ్, బొంత శ్యామేల్‌రాజు, బొంత దివ్య.. మరో నలుగురు చవుటుపల్లి ధనమ్మ, చవుటుపల్లి సబ్బులమ్మ, వెంకాయమ్మ, ఆటో డ్రైవర్ బొంత ఆరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిలకలూరిపేట, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**స్వగ్రామంలో శోకం..**

ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు చనిపోవడంతో వేలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతులందరూ వ్యవసాయ కూలీలు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు,




ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు.. చిలకలూరిపేట ఆసుపత్రిలో మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించారు. ప్రైవేట్ ట్రావెల్స్‌తో మాట్లాడి తగిన పరిహారం అందించేలా చూడాలని అధికారులను పుల్లారావు కోరారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం తరఫున తగిన న్యాయం జరిగేలా చూస్తానని ఎంపీ లావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ బాధిత కుటుంబ సభ్యులను, అధికారులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద ఘటనపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**నిర్లక్ష్యం బలి తీసుకుంది!**

ఆటో, బస్సు డ్రైవర్లు కొంచెం జాగ్రత్త వహించినా ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలుస్తోంది. అడ్డరోడ్డులో ఆటో మలుపు తిరిగే సమయంలో బస్సు ఆటోను ఢీకొట్టింది. డ్రైవర్లిద్దరూ అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ప్రమాదం జరిగేది కాదని తెలుస్తోంది. అతివేగంతో దూసుకెళ్లే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి**

చిలకలూరిపేట ఘోర రోడ్డుప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పవన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ చిలకలూరిపేట దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు.

# వెలుగుల వెలిగొండ

-మొదటిపేజీ తరువాయి

నెల్లూరు, కడప జిల్లాల్లో తక్కువ వర్షపాతంతో నిత్యం కరువు కాటకాల సమస్యలకు పరిష్కారంచూపడంతో పాటు సురక్షిత తాగునీరు లేని ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల విముక్తి కోసం రూపకల్పన చేసిన ప్రాజెక్టు వెలిగొండ. శ్రీశైలం నుంచి కృష్ణా వరద నీటిని నల్లమల కొండల కింద నిర్మించిన రెండు సొరంగాల ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తరలించి 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అంతేకాకుండా నల్లమల సాగర్ రిజర్వాయర్‌ను నీటితో నింపడం వల్ల సమీప ప్రాంతాల్లో ప్రస్తుతం 30 నుంచి 60 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు పెరిగి 6 మీటర్లలోనే అందుబాటులోకి రానున్నాయి.

**శంకుస్థాపన చేసింది చంద్రబాబే**

1985లోనే వెలిగొండ ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటికీ 1994లో దీనికి సంబంధించిన డీపీఆర్ పూర్తయ్యింది. 1996 మార్చి 5న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నల్లమల కొండల శ్రేణిగా పిలిచే వెలిగొండల శ్రేణిలో గ్యాప్‌లను పూడ్చటం ద్వారా రిజర్వాయర్ పూర్తి చేయాలనేది ప్రణాళిక. 1998లోనే సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.138 కోట్ల పరిపాలన అనుమతులు వచ్చాయి. అనంతరం కాకర్ల డ్యాంకు కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆనకట్టల నిర్మాణం పూర్తయి 53.85 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ రూపుదిద్దుకుంది. దోర్నాల మండలం కొత్తూరు వద్ద సొరంగాలు ఉన్న ప్రాంతం నుంచి దాదాపు 22 కి.మీ దూరంలో ఉన్న నల్లమల సాగర్‌కు ఫీడర్ కాలువ ద్వారా నీటిని తరలిస్తారు. ఈ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువల ద్వారా నిర్దేశిత ప్రాంతాలకు నీటిని అందిస్తారు.

**పనుల్లో జాప్యంతో పెరిగిన అంచనా వ్యయం**

2004లో టన్నెల్-1, 2009లో టన్నెల్-2 పనులు ప్రారంభమైనప్పటికీ తవ్వకాల సమయంలో ఏర్పడిన అవాంతరాల కారణంగా జాప్యం జరిగింది. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కుపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. 2014కు ముందు సరైన ప్రణాళిక లేకుండా చేసిన పనుల వల్ల కాలవ్యవధితో పాటు ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా పెరిగిపోయింది. 1996లో రూ.980 కోట్లతో ప్రారంభమైన అంచనా వ్యయం ఇప్పుడు రూ.10,200 కోట్లకు చేరింది. టన్నెల్ నిర్మాణాలు పూర్తికాకుండానే కాలువల తవ్వకం పనులు చేయడం, నిర్వాసితుల సమస్య వదిలేయడం వంటి చర్యలతో 2014కు ముందు కేవలం మట్టి తవ్వకం పనులపైనే శ్రద్ధ చూపారు. ప్రధాన కాలువ తవ్వకం కూడా పూర్తి చేయకపోగా, బ్రాంచ్ కాలువ, మేజర్, మైనర్ కాలువల నిర్మాణం చేపట్టలేదు. ఫీడర్ కాలువ పూర్తి చేసినట్టు మట్టి పనులతో చేతులు దులుపుకోవడంతో వర్షం కురిసినప్పుడు వచ్చిన వరద నీటికే ఫీడర్ కాలువకు నాలుగైదు చోట్ల గండ్లు పడ్డాయి.

**చంద్రబాబు హయాంలోనే పనుల్లో వేగం**

2014 జూన్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచారు. ఐదేళ్ల కాలంలో [illegible],388.81 కోట్లు [illegible] పూర్తి చేశా[illegible]8 కి.మీ పొడవున్న టన్నెల్-1లో అప్పటికి బ్యాలెన్స్ ఉన్న 7.2 కి.మీల తవ్వకంలో 2019 నాటికి 4.3 కి.మీ పూర్తి చేశారు. టన్నెల్-2లో 10 కి.మీ తవ్వాల్సి ఉంటే అందులో 2019 నాటికి 2.3 కి.మీ పూర్తి చేశారు. 2024లో మళ్లీ సీఎంగా పగ్గాలు చేపట్టాక కేవలం రెండేళ్ల రెండు నెలల్లో రూ.2,402 కోట్ల పనులు పూర్తి చేశారు. ఫీడర్ కాలువ పటిష్ఠతకు రూ.456 కోట్లు ఖర్చు చేసి కాంక్రీట్ రిటైనింగ్‌వాల్, లైనింగ్ పనులు పూర్తి చేశారు. టన్నెల్-2లో బెంచింగ్ లైనింగ్ పనులు వేగంగా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 2,770 మీటర్ల బెంచింగ్ పనులు చేస్తే, కూటమి హయాంలో 4,924 మీటర్ల పనులు పూర్తి చేశారు., వైసీపీ సర్కారు ఐదేళ్లలో 702 మీటర్ల లైనింగ్ మాత్రమే చేయగా, కూటమి వచ్చాక 6,988 మీటర్ల లైనింగ్ పూర్తి చేసింది. టీబీఎం తొలగింపునకు కోర్టు అనుమతులతో వెంటనే పనులు ప్రారంభించి దాని విడిభాగాలు బయటకు తెచ్చారు. మొత్తం 1,901 టన్నులకు గాను ఇప్పటికి 1,650 టన్నుల భాగాలు బయటకు తీశారు. కొల్లంవాగు వద్ద హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి చేయడంతో పాటు అక్కడ కుప్పగా పోసిన మక్, టన్నెల్‌లలో ఉన్న దాదాపు 1.20లక్షల క్యూ.మీ మక్ (మట్టి వ్యర్థాలు) తొలగింపు పూర్తి చేశారు.

**నిర్వాసితుల సమస్యకు పరిష్కారం**

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో ఉన్న 7,321 నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లింపును కూటమి ప్రభుత్వం చేపట్టింది. నీటి విడుదలకు ముందే చెల్లిస్తామని చెప్పినట్టుగానే జూన్ 29న రూ.306 కోట్లు, రెండో విడత ఈనెల 19న రూ.200 కోట్లు, మూడో విడత 22న రూ.250 కోట్లు చెల్లించింది. మిగిలిన రూ.132 కోట్ల పరిహారాన్ని నిర్వాసితులకు సంబంధించిన సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇక త్వరలో నీటి విడుదల చేయనున్న నేపథ్యంలో 11 గ్రామాల నిర్వాసితులు ఊళ్లు ఖాళీ చేసి బయటకు వస్తున్నారు. వారికి కేటాయించిన కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం ప్లాట్ల కేటాయింపును పూర్తి చేస్తోంది. మొత్తంమీద 2014 నుంచి 2019వరకు రూ.1,388.81 కోట్లు, 2024 నుంచి ఇప్పటివరకు రూ.2,402.35 కోట్లు ఖర్చు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుంది. మధ్యలో వైసీపీ సర్కారు పూర్తి కాని ప్రాజెక్టును జాతికి అంకితం చేయగా.. అన్ని పనులూ చేసి ఈ నెల 31న మొదటి సొరంగం ద్వారా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేసి నల్లమలసాగర్ రిజర్వాయర్‌కు చేరుస్తున్నారు.

**జగన్ సర్కారు నిర్వాకం**

2019-24 మధ్య జగన్ సర్కారు ప్రాజెక్టు పనులను పూర్తిగా అపహాస్యం చేసింది. ఐదేళ్లలో కేవలం రూ.981.66 కోట్ల పనులను చేసి అందులో కూడా రూ.140 కోట్ల బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. టన్నెల్-2లో ఇరుక్కుపోయిన టీబీఎం తొలగింపు గురించి కనీస ఆలోచన చేయలేదు. హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా పూర్తి చేయలేదు. నిర్వాసితుల ఆర్అండ్ఆర్ విషయం పట్టించుకోకుండా పునరావాస కాలనీలను కూడా వదిలేయడంతో చిల్లచెట్ల మధ్య [illegible]నీలన్నీ [illegible]ఉండిపోయాయి. [illegible] చేయ[illegible] [illegible]టి సీఎం జగన్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేశారు.

**ప్రాజెక్టు పరిధి**

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నాలుగు జిల్లాల్లోని 30 మండలాల పరిధిలో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మార్కాపురం జిల్లాలో 20 మండలాలు, ప్రకాశంలో 3, నెల్లూరులో 5, కడప జిల్లాలో 2 మండలాలకు నీరందుతుంది. ఫ్లోరైడ్ ప్రాంతాల్లోని 23 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందుతుంది. నాలుగు జిల్లాల్లో 9 నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది. వాటిలో ఎర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కొండపి, దర్శి, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు నియోజకవర్గాలు ఉన్నాయి. భూగర్భ జలాల మట్టాలు పెరుగుతాయి. 840 అడుగుల శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి కృష్ణా వరద జలాలు అందుబాటులోకి వస్తాయి.

**కొనసాగుతున్న వెలిగొండ సంబరాలు**

వెలిగొండ ప్రారంభానికి సిద్ధమవడంతో మార్కాపురం జిల్లా అంతటా సంబరాలు సాగుతున్నాయి. వరాల వెలిగొండ వారోత్సవాల పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ కూటమి ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. అందులో భాగంగా ఎర్రగొండపాలెంలో గురువారం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ట్రాక్టర్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయ మాడవీధుల్లో భారీఎత్తున మహిళలతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు.

**కీలక ఘట్టాలు**

1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రతిపాదనను ఉమ్మడి ప్రకాశం జిల్లాల నేతలు తీసుకువెళ్లారు.

1994లో ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక సిద్ధమైంది.

1996 మార్చి 5వ తేదీన ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు భూమి పూజ చేశారు.

1998లో ఇంజనీర్-సలహాదారు రామకృష్ణయ్య ప్రాజెక్టు ప్రాథమిక నివేదిక తయారు చేశారు.

1998లో సుంకేసుల, గొట్టిపడియ ఆనకట్టలకు రూ.138 కోట్లతో పాలనా అనుమతులు.

1999లో సుంకేసుల గ్యాప్ పనులు ప్రారంభం

**మారనున్న 'మార్కాపురం' భవిష్యత్తు**

బిందెడు నీళ్ల కోసం ఎదురు చూపులు.. ఫ్లోరైడ్ సమస్యలతో అనారోగ్యం బారినపడటం.. పంట పండుతుందనే ఆశతో విత్తనం వేయడం.. పంట పండకపోతే వలసపోవడం.. ఇవన్నీ మార్కాపురం జిల్లా ప్రజల కష్టాలు. వర్షం పడితే పంట.. పండకపోతే అప్పు. బోరు పనిచేస్తే సాగు.. అడుగంటితే వలస. ఇలా తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజల కష్టాలు తీర్చేందుకు వెలిగొండ ప్రాజెక్టు భరోసా ఇవ్వనుంది. ఒకప్పుడు రాయలసీమ కంటే తీవ్ర కరువు కాటకాలకు చిరునామాగా నిలిచిన మార్కాపురం ప్రాంతానికి ఇప్పుడు వెలిగొండ జలాలు కొత్త ఆశలు తీసుకొస్తున్నాయి.

## అందరినీ క్షేమంగా తేవడమే మన ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

సమాచారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని,

**41 మంది చిక్కుకున్నారు..**

మానస సరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకుపోయిన ఏపీ యాత్రికుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తున్నామని అధికారులు సీఎంకు తెలిపారు. రాష్ట్రానికి చెందిన 41 మంది నేపాల్ వరదల్లో చిక్కుకున్నట్లు ఇప్పటివరకు గుర్తించామని.. వీరిలో 34 మంది సురక్షితంగా ఉన్నారని, మరో ఏడుగురి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. రహదారి, విమాన మార్గాలు పునరుద్ధరించాల్సి ఉండడంతో ప్రస్తుతం కొందరు అక్కడే చిక్కుకుపోయారని తెలిపారు. కర్నూలు-ఆదోని ప్రాంతానికి చెందిన నలుగురు టిబెట్‌లో సురక్షితంగా ఉన్నారని, వారితో మాట్లాడామని చెప్పారు. తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు కాట్‌మాండూలో సురక్షితంగా ఉన్నారని, వారిని కూడా ఆర్టీజీఎస్ నుంచి సంప్రదించామని తెలిపారు. చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన ఏడుగురు గల్లంతయ్యారని.. వారి ఫోన్లు అందుబాటులో లేవని చెప్పారు. సమాచారాన్ని బాధితుల కుటుంబాలకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం సమాచారం సేకరిస్తున్నామని.. కేంద్రంతో పాటు కాట్‌మాండూ, చైనా ఎంబసీలతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు.

## రూ.1,430 కోట్లతో అభివృద్ధి పనులు

-మొదటిపేజీ తరువాయి

అంగీకరించడంతో పాటు, డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు కూడా ఆమోదం లభించింది. నేషనల్? ఇన్‌స్టిట్యూట్? ఆఫ్? ఎలక్ట్రానిక్స్?, ఐఓసీఎల్? గ్రీన్? ఎనర్జీ అభివృద్ధికి కూడా అనుమతులు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. 2026 జనవరి 6 లోపు రుణాలు తీసుకున్న రెండో దశ భూ సమీకరణ రైతులకు కూడా రుణమాఫీ వర్తింపజేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించినట్లు తెలిపారు. 'నగరంలో 135 లీటర్ల నీటిని ప్రతీ ఇంటికి ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇప్పుడున్న పైప్?లైన్లతో ఆ నీటి పంపిణీ చెయ్యడానికి కుదరదు. వాటర్? పైప్?లను మార్చడానికి అదనంగా రూ. 533 కోట్లు విడుదల చెయ్యడం జరిగింది. ఎల్పీఎల్? చిన్న రోడ్లు వెయ్యాలనుకున్నాం. కొన్ని సంస్థలతో వీటిని అధ్యయనం చేయించాం. కొత్త నగరానికి తరచూ ఎక్కువ వాహనాల రాకపోకలు ఉంటాయి కానీ సీసీ రోడ్లు వేస్తే దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు చెప్పారు. ఆ సమస్యకు చెక్? పెట్టేందుకు బీటీ రోడ్లకు అనుమతులు వచ్చాయి. సెంట్రలైజ్?డ్? పబ్లిక్? లైబ్రరీ, ఆడిటోరియం, హెచ్?ఆర్? భవనాల నిర్మాణాలకు ఐఓసీతో ఎంఓయూలు కుదుర్చుకోవడానికి అనుమతులు వచ్చాయి.' -పి. నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

## పంచదార్ల కొండపైతవ్వకాలు బంద్!

**అమరావతి :** అనకాపల్లి జిల్లా పంచదార్ల కొండపై ఉన్న ఆలయాల సంరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొండప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రాంతంలో ఇప్పటికే ఇచ్చిన గ్రావెల్ మైనింగ్ లీజులు పనిచేయవని సర్కారు స్పష్టం చేసింది. ఇకపై భవిష్యత్తులోనూ అక్కడ ఎలాంటి మైనింగ్ అనుమతులు ఇవ్వరు. ఇంకోవైపు.. అక్కడ జరిగిన అక్రమ మైనింగ్‌పైనా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గనుల శాఖ అధికారిని సస్పెండ్ చేసింది. తాజాగా అక్రమ తవ్వకాలు జరిపిన లీజుదారు నుంచి పెనాల్టీ వసూలుకు డిమాండ్ నోటీసులు జారీ చేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పంచ దార్ల గ్రామంలోని కొండపై శ్రీ ఉమా ధర్మలింగేశ్వర ఆలయం, రాధా మాధవస్వామి, విశ్వేశ్వరస్వామి, సహస్ర లింగేశ్వరస్వామి ఆలయాలు చాలా ఉన్నాయి. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ఐదు ధారలు ప్రవహిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతానికి పంచధారలని.. పంచదార్ల కొండ అని పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈ ఏడాది మే నెలలో ఈ కొండ ప్రాంతంలోని సర్వే నంబర్ 1లో 2.153 హెక్టార్ల పరిధిలో గ్రావెల్ మైనింగ్ లీజును విజయ్‌కుమార్‌నాయుడు అనే వ్యక్తికి గనుల శాఖ ఇచ్చింది. అయితే లీజుదారు హద్దులు దాటి.. నిబంధనలకు విరుద్ధంగా ఆలయాలకు సమీపంగా మైనింగ్ చేసుకుంటూ వెళ్తుండడంతో గర్భగుడులకు ప్రమాదం పొంచి ఉందని భక్తులు, గ్రామస్థులు ఆందోళనలకు దిగారు.ఇటు దేవదాయ శాఖకు, అటు రెవెన్యూ, అటవీ, పర్యావరణ శాఖలకు కూడా ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని అనకాపల్లి గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)కి సైతం ఫిర్యాదులు అందాయి. అయితే గనుల శాఖ అధికారులు పెద్దగా స్పందించలేదు. ఇందుకు కారణం రాజకీయ ఒత్తిళ్లే. మైనింగ్ చేసేది ఓ ప్రముఖ ప్రజాప్రతినిధికి కావలసిన వ్యక్తి అని.. అక్కడ ఏం జరిగినా కన్నెత్తి చూడవద్దని, ఫిర్యాదులను లెక్కచేయొద్దని మౌఖిక ఆదేశాలు ఉండడం వల్లే వారు మౌనం వహించారని విమర్శలు వెల్లువెత్తాయి.

అక్ర మ మైనింగ్ ఫిర్యాదులపై తొలుత విచారణ జరిగింది. నేరుగా జిల్లా ఏడీ శ్రీనివాస్ నేతృత్వంలో జాయింట్ సర్వే చేయించారు. లీజు ఏరియాను దాటి వాయవ్య దిశగా ప్రభుత్వ భూముల పరిధిలో 1.39 లక్షల టన్నుల మేర గ్రావెల్ తవ్వినట్లు నిర్ధారించారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని గనుల శాఖ తేల్చింది. డిస్పాచ్ పర్మిట్లు 1.04 లక్షల మెట్రిక్ టన్నుల వరకే లీజుదారుకు ఇచ్చారు. ఆయన పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలకు పాల్పడ్డారని గనుల శాఖ గుర్తించింది. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా, ప్రజాప్రతినిధులు సమాచారం ఇచ్చినా స్పందించని గనుల శాఖ ఏడీ శ్రీనివ్ష?సను సస్పెండ్ చేసింది. తర్వాత మైనింగ్ లీజుదారుకు కూడా నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వి తీసుకెళ్లిన గ్రావెల్‌కు పెనాల్టీ చెల్లించాలని స్పష్టంచేశారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పంచదార్లకొండను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని గనుల శాఖ డైరెక్టర్ డబ్ల్యూబీసీ చంద్రశేఖర్ ఈనెల 17న ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. నిజానికి పంచదార్లకొండ ప్రాంతంలో 2.153 హెక్టార్ల పరిధిలో గ్రావెల్ మైనింగ్ లీజు అనుమతులు పదేళ్లకు సరిపడా ఇచ్చారు. అయితే అక్రమ మైనింగ్ నిర్ధారణ అయిన నేపథ్యంలో అనుమతులు నిలిపివేసి.. కొండ ప్రాంతంలో మైనింగ్‌పై మొత్తంగా నిషేధం విధించాలని డైరెక్టర్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు సర్కారు తాజాగా ఆమోదం తెలిపింది. పంచదార్లకొండపై మైనింగ్‌ను నిషేధిస్తూ, ఆ ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా గురువారం జీవో 226 జారీ చేశారు. త్వరలో ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులపై కూడా క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు.

## హిందూ సెంటిమెంట్ కు చోటుందా

**నెల్లూరు :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్న వి.విజయసాయిరెడ్డి క్యాంపు మార్చి, సరికొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆకస్మికంగా ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్టీ స్థాపన కంటే ఎక్కువగా ఆయన ఎంచుకున్న హిందూత్వ ఎజెండా, సామాజిక మతపరమైన అంశాలు ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా కాకినాడ లవ్ జిహాద్ ఆరోపణల వ్యవహారం, సాధిక్ ఖాన్ అంశంపై పదే పదే మాట్లాడటం , ఏపీలో మత మార్పిడుల నిరోధక చట్టం తేవాలని కోరడం ద్వారా తన నూతన పొలిటికల్ లైన్ హార్డ్ కోర్ హిందూత్వ అని విజయసాయిరెడ్డి స్పష్టమైన సంకేతాలిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఉత్తరాది రాష్ట్రాలు లేదా పక్కనే ఉన్న కర్ణాటక మాదిరిగా మతపరమైన సమీకరణాలు , పోలరైజేషన్‌ఓటు బ్యాంకుగా మారిన దాఖలాలు లేవు . ఉమ్మడి ఏపీ నుంచి నేటి వరకు ఇక్కడ రాజకీయం అంతా కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి , బలమైన ప్రాంతీయ నాయకత్వాల చుట్టూనే తిరిగింది. బీజేపీ కూడా ఏపీలో సుదీర్ఘకాలంగా ఉనికిలో ఉన్నప్పటికీ, ఒంటరిగా మత ఆధారిత ఓట్లతో సక్సెస్ కాలేకపోయింది. అందుకే విజయసాయిరెడ్డి తెరపైకి తెచ్చిన లవ్ జిహాద్ , మత మార్పిడుల కార్డు ఆంధ్రా నేలపై ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ప్రధాన ప్రశ్న.ఏపీ ఓటర్లు ఎప్పుడూ కుల ప్రాతిపదికన, సంక్షేమ ఆధారంగా ఓటు వేయడానికి ప్రాధాన్యతనిచ్చారు తప్ప.. తీవ్రమైన మతపరమైన ఎజెండాలను స్వీకరించలేదనడానికి గత ఎన్నికల ఫలితాలే ఉదాహరణ. విజయసాయిరెడ్డి ఈ వ్యూహాన్ని ఎంచుకోవడం వెనుక బలమైన రాజకీయ అంశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్సీపీ మైనారిటీలు, క్రిస్టియన్ల వైపు ఆకర్షితమైందనే టాక్ ఉన్నందున .. అధికార టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కూడా మైనారిటీ ఓట్లను కోల్పోకూడదనే భయంతో లవ్ జిహాద్ వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడటానికి వెనుకాడుతోందని ఆయన బహిరంగంగానే ఆరోపించారు. ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య ఖాళీగా ఉన్న కట్టర్ హిందూ ఓటు బ్యాంకు ను టార్గెట్ చేయడం ద్వారా, తన కొత్త పార్టీకి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించవచ్చని విజయసాయిరెడ్డి భావిస్తున్నారని అనుకోవచ్చు.

# రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమంపై డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న -గొల్లపల్లి అమూల్య



**సఖినేటిపల్లి ఆగస్టు 27(మీ వార్త విలేఖరి రవి).** సఖినేటిపల్లి మండలం వుయ్యూరి వారి మెరక గ్రామంలో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీమతి గొల్లపల్లి అమూల్య గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్రామం లోని పలు ఇళ్లను సందర్శించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు వనగూరుచున్న ప్రయోజనాలను తెలియజేస్తూ ప్రజల నుంచి వస్తున్న వినతులను శ్రద్ధగా ఆలకించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ భరోసా కల్పించారు ప్రజల నుండి ఊ2ఊ కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు పెచ్చెట్టి బాబు, మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు చెల్లుబోయిన నాగబాబు, మండల బీసీ సెల్ అధ్యక్షులు కొల్లు మహాలక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు చెల్లుబోయిన జయ సూరిబాబు, చేనేత సాధికార సభ్యులు కొండ శివయ్య, జనసేన నాయకులు తోట ప్రసాద్, జనసేన నాయకులు ఓదూరి రాజా, క్లస్టర్ తాడి రాము, బూత్ కన్వీనర్ ఉయ్యూరి హరిప్రసాద్ రాజు, మండల ంచీజఖ అధ్యక్షులు పాటి వెంకటేశ్వరావు, బూత్ కన్వీనర్లు జిల్లెళ్ళ పావెల్ రెడ్డి, తాడి రవీంద్ర, స్థానిక నాయకులు వీర చలపతి, తోలేటి సత్యనారాయణ, గుండాబత్తుల అప్పారావు, కోళ్ళ రాంబాబు, తోట సత్యనారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# పది పరీక్షల్లో పాఠశాలలో ప్రథమ ర్యాంకు సాధించిన

**మామిడిపల్లి భావన లక్ష్మీకి గొర్తి ఈశ్వర విద్యార్థికి గొర్తి ఈశ్వర ట్రస్ట్ 15,000 రూ ఆర్థిక సహాయం.**

**పోలవరం మీ వార్త ఆగస్టు 27** ఏలూరు జిల్లా పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన పదవ తరగతి ఫలితాలలో పాఠశాల ప్రథమ ర్యాంకు సాధించిన మామిడిపల్లి భావన లక్ష్మీ కి గొర్తి ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపకులు గొర్తి ఉషాబాల, పవన్ కుమార్ ఆర్థిక సహాకారంతో గొర్తి ఈశ్వర్ ట్రస్ట్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి మండల విద్యాశాఖ అధికారి ఎల్ సత్యనారాయణ సమక్షంలో గురువారం 15,000 రూపాయల చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా గొర్తి ఈశ్వర ట్రస్ట్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి మాట్లాడుతూ ట్రస్టీలు మరియు వారి తల్లి తండ్రులు పని చేసిన ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని 36 పాఠశాలలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు గత సంవత్సరం నుండి 499 వరకు మార్కులు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు పదివేల రూ,, 500 నుండి 574 మార్కు సాధించిన విద్యార్థులకు 15 వేల రూ,, 575 నుండి ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు 25 వేల రూ,, ట్రస్ట్ తరపున అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం పోలవరం ప్రభుత్వం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి 25,000 రూ,,చెక్కు ను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎంఈఓ ఎల్ సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థినీ మామిడిపల్లి భావన లక్ష్మీ కి 15,000 రూ,,మరియు ప్రశంసా పత్రం ఇవ్వటం చాలా అభినందనీయం అని, విద్యార్థులకు అండగా నిలుస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉషాబాలా పవన్ కుమార్ లకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని పది పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు.. ఉపాధ్యాయురాలు భవాని మాట్లాడుతూ



ఎక్కడో కాశీలో ఉంటూ మా హై స్కూల్ విద్యార్థికి గత మూడు సంవత్సరముల నుండి ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులు కు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో ఇస్తున్నందుకు ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉషాబాలా పవన్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.
ఈ కార్యక్రమం లో గ్రామస్తులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని నిలిపివేయాలి..

**తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన రేషన్ డీలర్లు..**

**పోలవరం మీ వార్త ఆగస్టు 27** రేషన్ డీలర్ల మనోవేదనకు గురి చేస్తున్న నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని నిలిపివేయాలని కోరుతూ పోలవరం తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీనివాస్ కు మండల రేషన్ డీలర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ సెప్టెంబరు నెల నుండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయు 10 శాతం బ్రోకెన్ రైస్ బియ్యం బస్తాలపై నూతనంగా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ చేయాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. ఆ క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ప్రతి రేషన్ డీలర్ మండల లెవెల్ స్టాక్ పాయింట్ నుండి దిగుమతి అయ్యే ప్రతి బస్తాను రేషన్ షాపులో దిగుమతి చేస్తున్న సమయంలో స్కాన్ చేస్తూ తన రేషన్ షాపు స్టాకు నిల్వలలో నమోదు చేయవలసి రావటం,అదే విధంగా ప్రతి రెండు బస్తాలను రేషన్ పంపిణీ చేసే సమయంలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఈపోస్ నందు నమోదు చేస్తూ పంపిణీ చేయవలసి రావటం వలన రేషన్ డీలర్లకు పని భారం మరియు సాంకేతిక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.రేషన్ డీలర్లలో చాలా మందికి ఇప్పటికీ ఆండ్రాయిడ్ మొబైల్స్ అందుబాటులో లేకపోవడం వలన ఈ స్కానింగ్ చేసే సమయంలో యాప్ ను డౌన్లోడ్ చేసుకునే పరిస్థితి లేదని అన్నారు.ఇదే సమయంలో మండల లెవెల్ స్టాక్ పాయింట్లనందు క్యూఆర్ కోడ్



నమోదు చేయు అంశాన్ని ప్రవేశపెట్టడం జరగలేదని అంటున్నారు.అధిక సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉన్న మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో కూడా క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ అనేది ప్రవేశపెట్టకపోవడం జరిగిందన్నారు. రేషన్ డీలర్లకు ఇప్పటికే ఎన్నో దశాబ్దాల నుండి వచ్చుచున్న తరగతుల సమస్యను ఇప్పటికీ పరిష్కారం చేయకపోగా ఆ తరగతులను కూడా అధికారికంగా రేషన్ డీలర్లను మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న తప్పులకు బాధ్యులంతను చేయటం డీలర్లను తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందనీ ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ప్రతి నెల అనధికారికంగా ప్రతి రేషన్ డీలరు తనకు ఉన్న అలాట్మెంటును బట్టి 100 కేజీల నుండి 300 కేజీల వరకు మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న అవకతవకల వలన నష్టపోతున్నామన్నారు.దీనిని సరి చేయకపోగా రేషన్ షాపులలో ప్రతి బస్తా 50 కేజీలుగా నిర్ధారిస్తూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయటం వలన మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో జరుగుతున్న అవకతవకలను అధికారికంగా రేషన్ డీలర్లతో మాఫీ చేయడం జరుగుతుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ఆవేదన చెందటం జరుగుతుందన్నారు. ఎన్నో ఇబ్బందులు సమస్యలు పరిష్కారం చేయవలసిన సమయంలో వాటన్నింటి పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రేషన్ డీలర్లను బాధ్యులను చేస్తూ రేషన్ డీలర్లను మనోవేదనకు గురి చేస్తున్న నూతన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని ఒకసారి సమీక్షించి అమలు చేయకుండా నిలిపివేయవలసిందిగా కోరారు.

## ఐ ఎఫ్ డబ్ల్యూ జే ఉమ్మడి తూర్పు కన్వీనర్ గా జి ఎన్ రావు

**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, ఆగస్టు, 27** ఇండియన్ ఫెడరేషన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ ఎఫ్ డబ్ల్యూ జె )ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ గా జి ఎన్ రావు ని యమితు లయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు,పి. రామ కృష్ణ,ప్రధాన కార్యదర్శి డి. నరేంద్ర సాయి నియామకపత్రాలు అందచేసారు.తనకు పదవి రావడానికి సహకరించినరాష్ట్ర అధ్యక్షులు పి. రామ కృష్ణ, ప్రధాన కార్యదర్శి డి. నరేశేంద్ర సాయి లకు జీఎన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ గా నియమితులైన జి ఎన్ రావు మాట్లాడుతూ.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో"ఐఎఫ్ డబ్ల్యూజే" బలోపేతానికి కృషి చేస్తాను అన్నారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లో తూర్పు గోదావరి, కాకినాడ జిల్లా,డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లు వున్నాయి.త్వరలో జిల్లాలకు కన్వీనర్ లను నియమించి, తరువాత పూర్తి స్థాయిలో జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి లో కమిటీలు నియమిస్తాను అన్నారు.

INDIAN FEDERATION OF WORKING JOURNALISTS
IFWJ



## పందిరి రాట కార్యక్రమంలో పాల్గొన్న- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గారు



**అయినవిల్లి ఆగస్టు 27 (మీ వార్త విలేఖరి రవి).** ప్రసిద్ధ అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో వినాయక చవితి మహోత్సవాలకు శ్రీకారం చుడుతూ నిర్వహించిన పందిరి రాట ముహూర్త కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరికీ విఘ్నాలు తొలగి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని ఎమ్మెల్యే గారు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా నియమితులైన దేవస్థాన చైర్మన్ గారితో పాటు డైరెక్టర్లు, దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా సూర్య తేజ ఆసుపత్రి ప్రారంభం



**జంగారెడ్డిగూడెం, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి ):**పట్టణం లో నూతనంగా ఏర్పాటు చేసిన సూర్య తేజ హాస్పిటల్‌ను గురువారం ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ , రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తో కలిసి చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని యాజమాన్యం వారు పేర్కొన్నారు.

## పాయకరావుపేటలో దళితులకు, పేదలకు ,ఇల్లు,ఇలు పట్టాలు ఇవ్వాలి,

**కుల వివక్షవ్యతిరేక పోరాట సమితి, డిమాండ్,,**




**పాయకరావుపేట ,, మీ వార్తా ప్రతినిధి,,** పాయకరావుపేట పట్టణ కేంద్రంలో సుమారు 45 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్ననిరుపేద దళితులు 12వరోజువంట వార్పు కార్యక్రమంతోనిరసన తెలియజేస్తున్న వారిని కలిసి న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాలియాద్రి మద్దతు ప్రకటించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 45 సంవత్సరాల నుంచి అక్కడే నివాసం ఉంటున్న దళితుల్ని, పేదలని ,భారతదేశానికి స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రోజు నదళితులు, పేదలు, వేసుకున్న పాకలను తొలగించడానికి ప్రయత్నం చేయడం అన్యాయమని, అన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా ,దళితులకు, పేదలకు, కనీసం ఉండడానికి ఇల్లు , ఇల్లు స్థలంలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు .ఇది దుర్మార్గం చర్యని ,రాష్ట్రానికి హోం మినిస్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రిగారు నియోజవర్గంలో దళితులకు ఇటువంటి అన్యాయం చేయడం బాధాకరమని తెలిపారు. ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం పేదలకు, దళితులకు, మంచి కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పి ,ఇక్కడ మాత్రం దళితులకుఅన్యాయంచెయడం జరుగుతుందని తెలిపారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సు ప్రకారం దళితులకు ,పేదలకు, భూములు ఇవ్వాలని, ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, తెలిపారు .ఆ సిఫార్సులు అమలు చేయాలని, అన్నారు .ఇక్కడ దళితులకు ఇల్లు ,ఇల్లు స్థలాలు ఇవ్వాలని, మరియు డ్రైనేజీ, మంచినీరు ,కరెంటు, సౌకర్యం కల్పించాలని, డిమాండ్ చేశారు .లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని తెలిపారు. .ఈ కార్యక్రమంలో కె.వి.పి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరెల్లి చిరంజీవి ,కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎం. సత్యనారాయణ ,మరియు అధిక సంఖ్యలో దళితులు, పేదలు ,పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న వరద ఉద్ధృతి.

భారీగా పెరుగుతున్న వరద ప్రవాహం.. 5.33 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల



**పోలవరం మీ వార్త ఆగస్టు 27** పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టు వద్ద గురువారం వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు పరిధిలోని స్పిల్వే, కాఫర్ డ్యామ్ ప్రాంతాల్లో నీటిమట్టాలు గణనీయంగా నమోదవుతున్నాయి. వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు, ప్రాజెక్టు భద్రతను దృష్టిలో ఉంచుకుని భారీగా వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో స్పిల్వే ఎగువ భాగంలో 30.950 మీటర్లు, దిగువ భాగంలో 21.800 మీటర్లు నీటిమట్టం నమోదైంది. అదే సమయంలో కాఫర్ డ్యామ్ వద్ద 16.100 మీటర్ల మేర నీటిమట్టం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు ప్రాజెక్టు వైపు చేరుతుండటంతో నీటి ప్రవాహంలో మార్పులు చోటుచేసుకుంటున్ యి.వరద ఉద్ధృతి నేపథ్యంలో ప్రాజెక్టు నుంచి 5,33,256 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. స్పిల్వే గేట్ల ద్వారా నీటిని దిగువకు పంపిస్తూ అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటిమట్టాలు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

భారీ వరద కారణంగా పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో అప్రమత్తత కొనసాగుతోంది. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు, ఎగువ ప్రాంతాల్లో వర్షాల పరిస్థితి, గోదావరిలోకి చేరుతున్న వరద ప్రవాహాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. వరద పరిస్థితిని బట్టి ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసే నీటి పరిమాణంలో మార్పులు ఉండే అవకాశం ఉంది. ప్రాజెక్టు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు వద్ద 5.33 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటి విడుదల కొనసాగుతుండటంతో గోదావరి దిగువ ప్రాంతాల



ప్రజల్లో అప్రమత్తత నెలకొంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహం మరింత పెరిగితే పరిస్థితిని బట్టి నీటి విడుదలను కూడా సర్దుబాటు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# కూటమి ప్రభుత్వం తోనే ప్రజలకు సంక్షేమం . అభివృద్ధి.





ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ..

**జీలుగుమిల్లి, (మీ వార్త ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం తోనే ప్రజలకు సంక్షేమం అభివృద్ధి భవిష్యత్తుకు భరోసా ఉంటుందని ట్రైకార్ చైర్మెన్ బొరగం శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ములగలంపల్లిలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో జరిగిన అభివృద్ధి సంక్షేమం నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని వివరించడానికి వెళితే ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పొందిన వారు ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువనేత లోకేష్ ప్రజల కోసం కొత్త కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ఎంతో బాగుందని ప్రజలు హర్షిస్తున్నారని అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశ భావం వ్యక్తం చేశారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సంకవల్లి సాయికృష్ణ, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్,తెలుగు యువత మండల అధ్యక్షులు గుడెల్లి లక్ష్మీనారాయణ, బీసీ సెల్ మండల అధ్యక్షులు తోట బాలరాజు, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు బలగాని సత్యనారాయణ, ఏఎంసి డైరెక్టర్ గద్దె సుబ్రహ్మణ్యం, తెలుగు రైతు నాయకులు ఉండవల్లి కిరణ్, ఉండవల్లి రామకృష్ణ,మరీదు పండు, ఆకిరెడ్డి ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఆకిరెడ్డి ప్రభాకర్, పోలవరం నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చాప రవి, ఉడా కొండయ్య, ఈడ నాగు, పీతల వెంకటేశ్వరరావు, వెలగల అజయ్, దొంగ మురళి, బలగాని అఖిల్, నరసింహమూర్తి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# గ్రామాలు అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలి.

ఎంపీపీ కోర్స పోచమ్మ.




**జీలుగుమిల్లి, (మీ వార్త ప్రతినిధి)** అధికారులంతా సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాలు ప్రజలు అభివృద్ధి సాధిస్తారని అందరం కలిసి పని చేయాలని ఎంపీపీ కోర్సపోచమ్మ పేర్కొన్నారు. గురువారం జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయం హాల్ నందు మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్పిటిసి మల్లం వసంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ పోచమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరాలంటే అధికారులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. అధికారుల కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఎంపీటీసీ నాలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు ప్రజలలో మమేకమై పని చేసామని ప్రస్తుతం పదవీకాలం ముగియనుండడంతో అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల సమన్వయంతో గ్రామాలలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పించిన ప్రజలకు, పార్టీ అధినేతలకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ కంచర్ల ఉషారాణి కంచర్ల పాండు దంపతులు తన ఎంపీటీసీ పదవీకాలం ముగియనుండడంతో ప్రజలకు తాగునీటి వసతి కల్పించాలని ఉద్దేశంతో తన సొంత నిధులతో కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ ను కంచర్ల ఉషారాణి కార్యాలయానికి బహుకరించారు. ప్రజా ప్రతినిధిగా ఐదేళ్లపాటు తమకు సహకరించిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉప్పల లలిత కుమారి, ఎంపీటీసీ సన్నం సురేష్, పూసం ఉదయ్, వెంకటలక్ష్మి, పలు అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా రాజకీయ తరగతులను జయప్రదం చేయండి

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథ)** ఖమ్మం జిల్లారాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ లాల్మియా పిలుపునిచ్చారు తల్లాడ పట్టణంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారి పాల్గొని ప్రసంగిస్తూ దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్న ఈ సమయంలో పాసిజానికి వ్యతిరేకంగా కార్మికులు కర్షకులు పోరాడాల్సిన అవసరం ఉందని కార్యకర్తలను చైతన్యపరిచే విధంగా ఈ తరగతులునిర్వహిస్తున్నామని ఈనెల 29 30 తేదీలలో తిరుమలాయపాలెం మండలం ఎం వెంకటపాలెం గ్రామంలో నిర్వహిస్తున్నామని వారు తెలిపారు దేశ ప్రధాని కార్పొరేట్లకు దాసోహం అయి పేదలను, అన్నీ వర్గాల ప్రజల వంచిస్తూ ధగా చేస్తున్నాడాన్నారు. గుజరాత్ వ్యాపారుల లాభలే ముఖ్యంగా ఆదాని, బంబానీ లకు దోచి పెట్టడమే లక్ష్యం గా పని చేస్తున్నాడన్నారు. కార్మికుల హక్కుల కాలారస్తు ఉన్నచాట్టాలను రద్దు చేసి 4లేబర్ కోడ్లను తెచ్చి కార్మికలకు సమ్మె హక్కు లేకుండా చేయడం ఎవరి మేలు కోసం అని, అది కార్పిరెట్లకు కార్మికులను బానీషా లు మార్చడమే అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా బలి చేస్తు వ్యవసాయరంగాన్ని ఆదానికి కట్టబెడుతున్నాడన్నారు. ఎం.ఎస్.పీ చట్టం చేయాలనీ, రైతువ్యతిరేక చట్టాలను రైతులు సంవత్సరం పొడవున ఢిల్లీ వేదిక గా పోరాడితే కేంద్రం వ్రాత పూర్వకంగా ఇచ్చిన హామీని ఇప్పటికి నెరవేర్చక పోవడం సిగ్గుచెటు అన్నారు. యువకులు ఢిల్లీ వేదిక గా జెన్ జీ ఉద్యమం చేపట్టారని కేంద్రంకు తగిన బుద్ధి చెప్పారన్నారు. దీనితో మోడీ గ్రాఫ్ రోజు రోజు పడిపోతుంది అన్నారు. కార్యకర్తలు నీటిలో చేపల ప్రజల్లో మమేకం కావాల్సిన అవసరం ఉందని వారన్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడలని అయన పిలుపును ఇచ్చారు. వ్యవసాయ రంగం లో సంక్షోభం తీవ్రంగా ఉంది అని కేంద్రం వ్యవసాయ మోటలకు మీటర్లు పెట్టి ఆదానికి వ్యవసాయ రంగాన్ని కట్టబేడుతున్నారు అన్నారు.

పోరాటాల ద్వారానే కేంద్ర నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం అని అందుకు ప్రజలు సిద్ధం కావాలి అని అయన అన్నారు. దేశంలో నిత్యావసర ధరలు పెంచి సామాన్యులకు పెనుబారం మోపుతున్నారని పోరాడితేనే మనం బతికే రోజులు ఏర్పడ్డయని అయన అన్నారు. ఈ సమావేశంలో తల్లాడ ఏన్మార్ సంయుక్త మండల కార్యదర్శి కే వెంకటేశ్వర్లు సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులు పటాన్ నాగుల్ మీరా డి రమణ జీ పుల్లమ్మ ఎస్ కే జానీ వీరభద్రం వెంకులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ గారిపై అసత్య ఆరోపణలు చేస్తున్న హమారా ప్రసాద్ పై రాజద్రోహం కేసు నమోదు చేయాలి పొద్దోకు నారాయణరావు



**ముమ్మిడివరం ఆగస్టు 27 మీవార్త ప్రతినిధి** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై అసత్య ఆరోపణలు చేస్తూ,ఆయన రచించిన భారత రాజ్యాంగాన్ని తరచూ అవమానానికి గురిచేస్తున్న హమారా ప్రసాద్ పై రాజద్రోహం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పొద్దోకు నారాయణరావు(బాలు) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు బాలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.హమారా ప్రసాద్ కేవలం ప్రచార ఆర్భాటం కోసమే అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కోట్లాది మంది అంబేద్కర్ అభిమానుల ఆత్మాభిమానాన్ని హేళన చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అంబేద్కర్ ను కల్పిత నాయకుడిగా పేర్కొంటూ పుస్తకాన్ని కూడా రాస్తున్నట్టు హమారా ప్రసాద్ ప్రకటించారని అదేనిజమైతే,దేశంలో అల్లర్లు,హింసాత్మక సంఘటనలు జరిగి శాంతిభద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని బాలు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తుగా హమారా ప్రసాద్ ను అదుపులోకి తీసుకొని అంబేద్కర్ని, రాజ్యాంగాన్ని అవమానించే చర్యలను అడ్డుకొని దేశంలో శాంతిభద్రతలను కాపాడవల సిందిగా బాలు విజ్ఞప్తి చేశారు.

## షేక్ మస్తాన్ కుమార్తె షాలిని వివాహ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించిన

పోలవరం ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి



**పోలవరం మీ వార్త ఆగస్టు 27** పోలవరం మండలం పోలవరం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ కుమార్తె షాలిని వివాహ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేదికకు విచ్చేసిన సుంకర వెంకటరెడ్డి నూతన వధూవరులు షాలిని మరియు వరుడిని ఆత్మీయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో,

ఆయురారోగ్యాలతో, ఆనందంగా

సాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్ కుటుంబ సభ్యులు సుంకర వెంకటరెడ్డి కి ఆత్మీయ స్వాగతం పలికి, తమ కుటుంబ శుభకార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన వధూవరులకు సుఖమయమైన దాంపత్య జీవితం కలగాలని సుంకర వెంకటరెడ్డి ఆకాంక్షించారు.

## హమారా ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి--- జిల్లా అధికారులకు దళిత సంఘాల జేఏసీ ఫిర్యాదు





**రాజోలు ఆగస్టు 27(మీ వార్త విలేఖరి రవి).** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, అసత్యాలను ప్రచారం చేస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన హమారా ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలక్టర్ ఆర్. మహేష్ కుమార్ కు, జిల్లా ఎస్పీ రాహుల్ మీనాకు రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసారు. ఈ మేరకు గురువారం జిల్లా కలక్టర్ను, జిల్లా ఎస్పీని కలసిన రాజోలు నియోజకవర్గ దళిత సంఘాల జేఏసీ నాయకులు హమారా ప్రసాద్ సోషల్ మీడియాలో అంబేద్కర్ పై చేస్తున్న అసత్య ప్రచారాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని లిఖితపూర్వకంగా కోరినట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ బయట హమారా ప్రసాద్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాలమహానడు అధ్యక్షులు బొంతు మణిరాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు దేవ రాజేంద్రప్రసాద్, దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ, విసికే పార్టీ రాష్ట్ర నాయకులు బొంతు వెంకట రమణ, దళిత చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్, ఎస్సీ సంక్షేమ సంఘ రాజోలు మండల అధ్యక్షులు మట్టా సురేష్ కుమార్, మాలల న్యాయపోరాట సమితి జేఏసీ మామిడికుదురు మండల అధ్యక్షులు మట్టా సత్తిబాబు, దళిత చైతన్య వేదిక రాజోలు మండల అధ్యక్షులు మందపాటి మధు, డిహెచ్పీఎస్ జిల్లా కార్యనిర్వక సభ్యులు పుల్లెళ్ళ ఆనంద్, న్యాయవాది వడ్డీ నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు మార్లపూడి దొరబాబు, బొంతు ప్రవీణ్

# అధికార మదం ఉన్నప్పుడు మైనర్ పంచాయతీ కీ పది లక్షలు, మేజర్ పంచాయతీకీ ఇరవై లక్షలు అంటూ ఏకగ్రీవం చెయ్యాలని ఆదేశాలు...

**కృత్తివెన్ను ఆగస్ట్ 27(మీ వార్త ప్రతినిధి )** యిప్పుడు ప్రతిపక్ష హోదా లేక దిక్కులేని పరిస్థితిలో ఏకగ్రీవాలు ఐతే సిటు ఉండదు అని సొంత పార్టీ నాయకులకు బెదిరింపులు...... అస్సలు పులివెందులలో స్థానిక ఎన్నికలు ఏకగ్రీవం అయితే పోటీ చెయ్యరా.... యిక బెంగుళూరు దాటి రారా..... కృత్తివెన్ను మండల టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అమరావతి డెస్క్ తొలి ఉదయం 27 - 08 - 2026 పులివెందుల ఏం ఎల్ ఏ, మాజీ సీఎం వై ఎస్ జగన్ బుధవారం పెట్టిన ప్రెస్ మీట్ పై కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం సీనియర్ టీడీపీ నాయకులు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పిన్నెంటి రత్తయ్య గురువారం తొలి ఉదయం ప్రతినిధితో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి తాను అధికారంలో ఉన్నప్పుడు మైనర్ పంచాయతీలు ఏకగ్రీవం ఐతే పది లక్షలు, మేజర్ పంచాయతీలు ఏకగ్రీవం అయితే ఇరవై లక్షలు ప్రభుత్వం నుండి ప్రజల సొమ్ము యిస్తాను అన్నది మర్చిపోయారా, లేదా ఎంపీటీసీ లు ఏకగ్రీవం అయితే ఒక్కో ఎంపీటీసీ సెగ్మెంట్ కు 5 లక్షలు, ఎంపీపీ, జడ్పీటీసీ లకు 50 లక్షలు యిస్తాము అన్నది మర్చిపోయారా, లేదా మునిసిపల్ కౌన్సిలర్ లు ఏకగ్రీవం అయితే 15 లక్షలు, మునిసిపల్ చైర్మన్ ఏకగ్రీవం అయితే 50లక్షలు ప్రజల సొమ్ము యిస్తాము అన్నది మర్చిపోయారా, లేదా జడ్పీ చైర్మన్ లు, మేయర్ లకు కోట్లు రూపాయలు ప్రజాధనం ఏకగ్రీవం అయితే యిస్తామని చెప్పింది మర్చిపోయారా అని వైసీపీ అధినేత వై ఎస్ జగన్ ను టీడీపీ కృత్తివెన్ను మండల సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య ప్రశ్నించారు. ఈ సందర్భంగా పిన్నెంటి రత్తయ్య మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనం పప్పు బెల్లల్లా పంచుతూ, ఏక గ్రీవాలు కావాలని తన 151 మంది పరమానందయ్యా శిష్యులను ఆదేశించిన జగన్ రెడ్డి యిప్పుడు అలీబాబా 11 మంది దొంగలకు చేరగానే తూచ్ తూచ్ ఏకగ్రీవాలు జరిగితే మీకు సీట్లు ఉండవు అని బెదిరించడం చూస్తుంటే జబర్దస్త్ కామెడీ కీ మించి జగన్ రెడ్డి కామెడీ ఉందని, అస్సలు సొంత నియోజకవర్గం పులి వెందులలో నెలకు ఒక్కటి అంటే ఒక్కరోజు ఉండకుండా బెంగుళూరు పారిపోయే జగన్ రెడ్డి సొంత యిలాకాలో పులివెందుల జడ్పీటీసీ ఫలితాలు చూసాక పోటీ చేసే నాథుడే లేడని అన్ని సర్వేలు చెబుతుంటే, జగన్ రెడ్డి మిగతా నియోజకవర్గంలకు వార్నింగ్ యివ్వడం వైసీపీ వాళ్లే కామెడీ అంటున్నారని టీడీపీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య అన్నారు. ఒకవేళ పులివెందుల లలో కనుక ఏకగ్రీవం అయితే రాజకీయ సన్యాసం తీసుకుని జగన్ రెడ్డి బెంగుళూరు కోటకు పరిమితం అవుతారా అని పిన్నెంటి రత్తయ్య



అన్నారు. 2024 లో యిలాగే ప్రగల్భాలు పలికి దాదాపు 60 మంది ఏం ఎల్ ఏ లకు సీట్లు యివ్వకుండా జగన్ రెడ్డి ఎన్నికలకు వెళితే 11 మిగిలాయని ఈసారి యిలాంటి ప్రగల్భాలు పలికితే నెక్స్ట్ 1 సిటు కూడా కష్టమని పిన్నెంటి రత్తయ్య అన్నారు.........

## రాఖీ పౌర్ణమి ప్రత్యేకత.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక



రాఖీ కడితే బంధం బలపడుతుంది.. ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే పండుగ రాఖీ పౌర్ణమి.. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే ప్రత్యేకమైన పండుగ. రక్త సంబంధం కంటే మమకారం గొప్పదని చాటిచెప్పే ఈ పండుగను దేశవ్యాప్తంగా ప్రజలు ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. ఈ రోజున అక్కాచెల్లెళ్లు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణులకు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తూ కానుకలు అందిస్తారు.

రాఖీ అనేది కేవలం రంగురంగుల దారం కాదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీక. చిన్ననాటి అల్లరి నుంచి జీవితంలోని ప్రతి దశలో ఒకరికొకరు అండగా నిలిచే సోదరసోదరీమణుల అనుబంధాన్ని ఈ పండుగ మరింత బలోపేతం చేస్తుంది.

**పండుగ సందడి**

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంటుంది. అక్కాచెల్లెళ్లు ప్రత్యేకంగా రాఖీలు కొనుగోలు చేసి సోదరుల చేతికి కడతారు. స్వీట్లు పంచుకుంటూ, కొత్త బట్టలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరసోదరీమణులు కూడా ఫోన్, వీడియో కాల్స్ ద్వారా శు భాకాంక్షలు తెలుపుకుంటారు.

**మారుతున్న కాలంలోనూ మారని బంధం**

కాలం మారినా.. జీవనశైలి మారినా.. రాఖీ పౌర్ణమి ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. ఉద్యోగాలు, చదువులు, వివాహాల కారణంగా దూరంగా ఉన్న అన్నాచెల్లెళ్లు ఈ పండుగ సందర్భంగా కలుసుకుని తమ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటారు. అందుకే రాఖీ పౌర్ణమి ఒక పండుగ మాత్రమే కాదు.. జీవితాంతం కొనసాగే అన్నాచెల్లెళ్ల ప్రేమకు మధురమైన జ్ఞాపకం.

రాఖీ కట్టే ఆ చేతుల్లో ప్రేమ..
రాఖీ కట్టించుకునే మణికట్టులో బాధ్యత..
ఈ రెండింటి మధ్యే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అసలైన అందం.
మీ వార్త ప్రతినిధి కృష్ణా జిల్లా

# కొండాపై యాక్షన్ తీసుకునే ధైర్యం చేస్తారా

**హైదరాబాద్ :** కొండా సురేఖ, చిన్నారెడ్డిల పదవులను తీసేయాలని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. నివేదికను హైకమాండ్ కు పంపించారు. కానీ నిర్ణయం ఎప్పుడు వస్తుందో చెప్పడం కష్టం. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలను, ప్రత్యేకించి పార్టీ అధిష్ఠానం నడుచుకునే తీరును పరిశీలిస్తే.. క్రమశిక్షణారాహిత్యంపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఆ పార్టీ చూపే ఆచితూచి అడుగులు వేసే వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. క్రమశిక్షణ తప్పిన నేతలపై వెంటనే వేటు వేయకుండా, వారు పార్టీకి తీవ్ర స్థాయిలో నష్టం చేకూర్చే వరకు లేదా స్వయంగా నిష్క్రమించే వరకు వేచి చూడటం కాంగ్రెస్ సాంప్రదాయ శైలిగా మారింది. తీన్మార్ మల్లన్న ఉదంతమే ఇందుకు తాజా ఉదాహరణ. బిసి కులగణన నివేదికను పబ్లిక్‌గా నిరసిస్తూ చించివేసినా, పార్టీ విధానాలపై బహిరంగ వ్యాఖ్యలు చేసినా, అధిష్ఠానం తక్షణమే చర్యలకు దిగలేదు. షోకాజ్ నోటీసులు జారీ చేసి సస్పెన్షన్ వేటు వేసే సమయానికి, జరగాల్సిన రాజకీయ నష్టం జరిగిపోయింది. మల్లన్న శైలిని గమనిస్తే ఆయన ఉద్దేశపూర్వకంగానే సస్పెన్షన్ పొందేలా తీవ్ర వ్యాఖ్యలు చేశారని, అంతవరకు పార్టీ లోపల ఉంటూనే వ్యతిరేక స్వరాలు వినిపించారనే అభిప్రాయం వ్యక్తమైంది. అదేవిధంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్ నేతలు పార్టీ నాయకత్వంపై పదే పదే విమర్శలు చేసిన సందర్భాల్లోనూ, క్రమశిక్షణా కమిటీ కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, తీవ్రమైన రాజకీయ ముగింపు ఇవ్వలేకపోయింది. ఈ తరహాలో చర్యలు తీసుకోకపోవడం వెనుక కాంగ్రెస్ అధిష్ఠానానిది బలహీనతా లేక వ్యూహమా అనేది ఆసక్తికరమైన ప్రశ్న. స్థానిక ప్రాంతీయ నాయకత్వం అతిగా బలోపేతం కాకుండా, నిరంతరం అంతర్గత వ్యతిరేకత ఉంచడమే హైకమాండ్ ప్రాథమిక ప్రణాళిక అని భావిస్తారు. ప్రాంతీయంగా ఒకే నాయకుడు తిరుగులేని శక్తిగా మారితే అధిష్ఠానంపై ఆధిక్యత సాధిస్తారనే ముందస్తు భయంతో, అసమ్మతి స్వరాలను పూర్తిగా అణచివేయకుండా సజీవంగా ఉంచడం కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న వ్యూహం. ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కారులో ఈ వైఖరి కొత్త సవాళ్లను తెచ్చిపెడుతోంది. ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రిపై లేదా కేబినెట్ సహచరులపై సొంత పార్టీ నేతలు గళమెత్తినప్పుడు అధిష్ఠానం చూపే నిర్లిప్తత, తిరుగుబాటు చేసినా తక్షణ పరిణామాలు ఉండవు అనే భరోసాను అసమ్మతి వర్గానికి ఇస్తోంది. కఠిన చర్యల



స్థానంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జీల ద్వారా బుజ్జగింపు రాజకీయాలు , కమిటీల ఏర్పాటు వంటి తాత్కాలిక పరిష్కారాలు అనుసరించడం వల్ల సమస్యలు సర్దుమణగకపోగా, స్థానిక నాయకత్వ పట్టు సడలిపోతోంది. సమగ్రంగా చూస్తే, పార్టీలో అసమ్మతిని నియంత్రించడంలో కాంగ్రెస్ చూపుతున్న కాలయాపన విధానం దెబ్బలను మరింత పెంచుతుందే తప్ప నయం చేయలేకపోతోంది. కానీ ఆ పార్టీ తీరులో మాత్రం మార్పు రావడం లేదు. మరో వైపు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ చుట్టూ ముసిరిన వివాదం హైకమాండ్ వద్దకు చేరింది. పార్టీ అంతర్గత వ్యవహారాలు, ప్రభుత్వంపై వచ్చిన విమర్శల నేపథ్యంలో ఏఐసీసీ దృష్టికి చేరిన ఈ వ్యవహారంలో అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయమే అత్యంత కీలకంగా మారింది. పార్టీ క్రమశిక్షణా కమిటీ , ఢిల్లీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని, హైకమాండ్ ఆదేశాల తర్వాతే తన తదుపరి రాజకీయ అడుగులు ఉంటాయని కొండా సురేఖ తన అనుచరులు, సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదంలో తన కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై వస్తున్న ఆరోపణలను కొండా సురేఖ తీవ్రంగా ఖండిస్తున్నారు. స్వతంత్ర అభిప్రాయాలు కలిగిన తన కుమార్తె మాట్లాడిన మాటలకు, పార్టీలో సుదీర్ఘ అనుభవం ఉన్న తనను బాధ్యురాలిని చేయడం సరికాదనేది ఆమె ప్రధాన వాదనగా ఉంది. ఏఐసీసీ పెద్దల వద్దకు ఈ అంశం వెళ్లినా, తనకు జరిగిన అన్యాయాన్ని , దారితీసిన పరిస్థితులను వివరిస్తే అధిష్ఠానం తప్పకుండా న్యాయం వైపే నిలుస్తుందనే దృఢమైన నమ్మకంతో ఆమె ఉన్నారు. అయితే, ఒకవేళ పార్టీ క్రమశిక్షణా కమిటీ లేదా అధిష్ఠానం కఠిన చర్యలకు మొగ్గు చూపి, రాజీనామా చేయాలని ఆదేశిస్తే దానికి కూడా సిద్ధపడాలనే ఆలోచనలో కొండా సురేఖ ఉన్నట్లు సమాచారం. కేవలం మంత్రి పదవికి మాత్రమే పరిమితం కాకుండా, శాసనసభ్యత్వానికి కూడా రాజీనామా చేసి తమ ఆత్మగౌరవాన్ని చాటుకోవాలని ఆమె వర్గం సన్నాహాలు చేస్తోంది. ఈ పరిణామం తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. మరోవైపు, కాంగ్రెస్ హైకమాండ్ తీసుకునే నిర్ణయం కోసం ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గంతో పాటు పార్టీలోని కీలక నేతలందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్రమశిక్షణారాహిత్యంపై చర్యలు తీసుకుని ఇతరులకు హెచ్చరిక పంపాలా, లేక సీనియర్ నేత కావడంతో సర్దుబాటు మార్గాన్ని ఎంచుకోవాలా అనే కోణంలో ఢిల్లీ పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సమానత్వ దినోత్సవం



**తాడేపల్లిగూడెం ఆగస్ట్ 27 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక డి.ఆర్. గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సమానత్వ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ గంధం వాణి అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది కాళ్ల లక్ష్మీ మహిళా హక్కులు, చట్టాలు, బాధ్యతల గురించి మాట్లాడారు. కే.కనకదుర్గ మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి వివరించారు. కళాశాల మహిళా సాధికారతా విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు వై . జ్ఞాన ప్రసూనాంబ, వీ కుసుమకుమారి, ఎం. ఇందిరమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలను సత్కరించారు.

## టీసీసీ మీడియా జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ను సన్మానించిన నూతి సత్యనారాయణ గౌడ్..



**తల్లాడ మీ వార్త ప్రతినిధి ఆగస్టు 27:** తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన నారపోగు ప్రసాద్ ను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సన్మానించారు. గురువారం తల్లాడకు వచ్చిన ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రసాద్ ను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా అధ్యక్షులుగా ప్రసాద్ ఎంపిక కావడం అభినందనీయమని, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా ఉండాలని సూచించారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్ కు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మీ రెడ్డి , జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాస రావు , ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు, కల్లూరు టౌన్ ఇంచార్జ్ కోసూరు వెంకటేశ్వర్లు (కె.వి), మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్,వెంకటరమణారెడ్డి,మండలం ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్,తుమ్మలపల్లి రమేష్ దాసరి శ్రీనివాసరావు ,మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సర్పంచులు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## చింతలపూడిలో సబ్ జైలు ను కొనసాగించాలి

న్యాయశాఖ కార్యదర్శి కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి ):**బ్రిటిష్ కాలం నుండి చింతలపూడి లో ఉన్న సబ్ జైల్లో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శి జి అనురాధను ఎమ్మెల్యే రోషన్ కుమార్ కోరారు.
ఈ మేరకు సచివాలయం బ్లాక్ వన్ లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి ఈ ప్రాంత పరిస్థితులను వివరించారు.
సబ్ జైల్ మార్చడం వలన పోలీస్, ఎక్సైజ్ శాఖల సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతారని, అన్ని సౌకర్యాలు ఉన్న ఈ సబ్ జైలు ను కొనసాగించాలని ప్రజల నుండి వచ్చిన వినతులు మేరకు ఎమ్మెల్యే రేషన్ కుమార్ న్యాయశాఖ అధికారులను కోరారు

## హార్టికల్చర్ ఎడి ఆఫీస్ ఏర్పాటు చెయ్యండి

వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్



**చింతలపూడి, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి )** జిల్లాలో హార్టికల్చర్ పంటలు అధికంగా సాగు చేయబడుతున్న నియోజకవర్గంలో హార్టికల్చర్ సహాయ సంచాలకులు కార్యాలయం ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా మరింత అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం కలుగుతుందని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ను సచివాలయంలో కలసి వివరించారు. కో కో పంటలో దేశంలోని తొలి స్థానంలో ఉన్న చింతలపూడిలో హార్టికల్చర్ పంటలను ప్రోత్సహించడానికి మరిన్ని నూతన వంగడాలు ప్రవేశపెట్టి అధిక ఓ దిగుబడులు సాధించడానికి ఎంత దోహదపడగలదని ఎమ్మెల్యే రోషన్ కుమార్ వివరించారు.
అందుకు అవసరమైన చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ కార్యదర్శి పేర్కొన్నారు

## నారీ శక్తికి అగ్రతాంబూలం బీజేపీతోనే,మహిళా సాధికారత సాధ్యం.

**అధిక సంఖ్యలో మహిళలు పార్టీ లో చేర్పించాలి.**

**బిజెపి మండల అధ్యక్షులు అడ్డాల,సోమరాజు.**



**అనంతగిరి,ఆగస్టు 27 ( మీ వార్త )** అల్లూరి జిల్లా అనంతగిరి మండలం లో ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు దేశ భవిష్యత్తును నిర్దేశించే నిర్ణయాత్మక శక్తులుగా ఎదుగుతున్నారు.మహిళలకు కేవలం సమాన అవకాశాలు మాత్రమే కాదు,సమాజంలో సముచిత గౌరవం,అత్యున్నత రాజకీయ ప్రాధాన్యత ఇస్తుందని అనంతగిరి బిజెపి మండల అధ్యక్షులు అడ్డాల,సోమరాజు తెలిపారు. భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక చట్టం దశాబ్దాల కల అయిన నారీ సత్తి వందన్ అధినియం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించిన ఘనత బిజెపి దేనని ఆయన పేర్కొన్నారు.దేశంలో ఆర్థిక స్వాలంబన ముద్రా లోన్స్,స్వయం సహాయక సంఘాల బలోపేతం ద్వారా కోట్లాది మంది మహిళలు నేడు సొంతంగా వ్యాపారాలు చేస్తూ లఖ్ పతి దీదీ లుగా మారుతున్నారు.

**మహిళలకు రక్షణే ప్రథమ కర్తవ్యం**

మహిళా భద్రత కోసం కఠినమైన చట్టాలు,రక్షణ వ్యవస్థల ఆధునీకరణతో ప్రతి మహిళలకు రక్షణ కర్తవ్యంగా కొండంత భరోసా లభిస్తుందని నాయకత్వంలో భాగస్వామ్యం కల్పిస్తూ పంచాయతీ,స్థాయి నుంచి పార్లమెంట్ వరకు మహిళలకు,కీలక పదవులు ఇచ్చి నిర్ణయాధికారాల్లో పెద్దపీట వేసిందన్నారు. రాజకీయాల్లో మార్పు రావాలన్నా సమాజంలో మహిళల,గళం మరింత బలంగా వినబడాలన్నా మహిళలు,రాజకీయాల్లోకి రావడం ఎంతో అవసరం దేశ ప్రగతిలో భాగస్వాములు కావడానికి, మీ ప్రాంత అభివృద్ధికి తోడ్పడటానికి బీజేపీ మహిళా మోర్చాలో చేరండి!అని బిజెపి పార్టీ కార్యకర్తలకు పిలుపునిస్తుందని ఆయన తెలిపారు.

## కోదండ రామాలయంనికి హుండీ బహుకరించిన దేవా బత్తుల రాంబాబు, మిత్ర బృందం



**పోలవరం మీ వార్త ఆగస్టు 27** పోలవరం మండలం పాత పోలవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం నికి తాడేపల్లిగూడెం వాస్తవ్యులు దేవా బత్తుల రాంబాబు, గాయత్రీ దంపతులు మరియు మిత్ర బృందం గురువారం హుండీ నీ బహుకరించారు.పాత పోలవరంలో పుట్టి చిన్ననాటి నుండి రామాలయం పరిసరాలలోనే ఆడుతూ పాడుతూ గడపమని ప్రస్తుతం రామాలయం బహు సుందరంగా నిర్మాణం జరిగిందని నూతన రామాలయ నిర్మాణంలో తాను, తన కుటుంబ సభ్యులు, స్నేహితులు భాగస్వాములు కావడం తమకు ఎంతో ఆనందంగా ఉందని దేవా బత్తుల రాంబాబు తెలిపారు. తమ స్నేహితులతో కలిసి గురువారం ఆలయ కమిటీ సభ్యులకు హుండీ ని అందజేయడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత పోలవరం రామాలయం కమిటీ సభ్యులు సూరవరపు వీరన్న, దేవా బత్తుల పోసి, పట్నాల బుజ్జి, మిత్ర బృందం పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా కారుమంచి



**ఆంధ్రప్రదేశ్ ఆగస్టు 27 (మీ వార్త ప్రతినిధి)** గూడూరు: గూడూరు మండలం ఆకుమర్రుకు చెందిన కారుమంచి కామేశ్వరరావును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాముకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, పెడనలో ఉప్పాల రాము విజయానికి శాయశక్తులా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయన నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

## సెప్టెంబర్ 1న మంగళవారం నరసాపురం రానున్న సీఎం చంద్రబాబు



**మొగల్తూరు : ఆగస్టు 27 మీ వార్తా జిల్లా ప్రతినిధి.** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గం లో సెప్టెంబర్ నెల ఒకటవ తేదీన రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటించ నున్నారు. నేను అబద్ధంలో గురువారం మొగల్తూరులోని పలు ప్రాంతాలలో అధికారుల బృందం విస్తృతంగా పర్యటించారు. జెసి కల్పశ్రీ, ఆర్డీవో దాసిరాజు, డి.ఎస్.పి ఎం సుధాకర్ రావు కలసి సీఎం పర్యటించే పలు ప్రాంతాలలో బహిరంగ సభ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాటను సమీక్షించారు.

## అమలాపురం లో ఘనంగా లంక దినకర్ జన్మదిన వేడుకలు



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,** ఆగస్టు, 27 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ లంక దినకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని అమలాపురంలోని లూయిస్ బ్లైండ్ స్కూల్‌లో విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు, కేక్‌లను పంపిణీ చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గనిశెట్టి అరవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆహార పదార్థాలు అందజేసి, వారితో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా గనిశెట్టి అరవింద్ మాట్లాడుతూ, ప్రజా సేవకు అంకితమై పనిచేస్తున్న లంక దినకర్‌కు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, అవకాశం భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులతో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, సమాజంలోని అన్ని వర్గాల పట్ల సేవాభావంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అరవింద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గనిశెట్టి అరవింద్ మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు

## మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న హోం మంత్రి, "అనిత"లి



**నక్కపల్లి, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి)** కోటవురట్ల మండల కేంద్రంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. హోం మంత్రి అనితకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చిన భక్తులను మంత్రి అనిత ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు.అనిత వెంట టిడిపి మాజీ మండల ప్రెసిడెంట్ జానకి శ్రీను, టిడిపి సీనియర్ నాయుకులు హరి బాబు, టిడిపి మండల ప్రెసెంట్, కుమార్, గోవిందు తదితర టిడిపి నాయుకులు పాల్గున్నారు.

## జీసీసీ కాంట్రాక్టు ఉద్యోగులకు ఐడీ కార్డులివ్వాలి.



**అనంతగిరి,ఆగస్టు 27 ( మీ వార్త )** గిరిజన సహకార సంస్థలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లకు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని సేల్స్‌మెన్‌ల మండల యూనియన్ అధ్యక్షులు బి ముత్యాలు కోరారు.గురువారం కాశీపట్నం జీసీసీ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ బుక్క వెంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముత్యాలు,మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా సేల్స్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు.తమకు సీఎఫ్ఎంఎస్ ఐడీతో నిధి పోర్టల్ ద్వారా ప్రతి నెలా జీతాలు చెల్లిస్తున్నారన్నారు.ఇప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ ఎంప్లాయి ఐడీ ద్వారా సంస్థ గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సేల్స్‌మెన్‌లు కిల్లో అప్పలస్వామి,రూంజల శోభన్ బాబు,కలయి అప్పలస్వామి,పంచాడి బలరాం,సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మచిలీపట్నం యు పి హెచ్ సి పరిధిలో ఫీవర్ సర్వే



**మచిలీపట్నం ఆగస్టు 27(మీ వార్త ప్రతినిధి)** యు పి హెచ్ సి మచిలీపట్నం నారాయణ పురం 50.వ సచివాలయం పరిధిలో ఫీవర్ సర్వే హౌస్ టూ హౌస్ జిల్లా మలేరియా అధికారి ఏ. జ్ఞానశ్రీ మేడం విజిట్ చేసి నారు. ఈకార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మురళి , హెల్త్ సూపర్ వైజర్స్ రాఘవేంద్ర రావు గారు, భట్రాజు సూరిబాబు గారు, ఏ ఎన్ ఎం , ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## చదువు ఆపేసిన వారికి మళ్ళీ చదువు కల్పించడమే అపాస్ లక్ష్యం

**జిల్లా కో-ఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ**



చదువు మధ్యలోనే ఆపేసిన వారికి మళ్లీ చదువుకునే అవకాశం కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (అపాస్) ను ఏర్పాటు చేసిందని అపాస్ జిల్లా కోఆర్డినేటర్ పీవీవీ సత్యనారాయణ రాజు అన్నారు.పెంటపాడు ప్రభుత్వ పోస్ట్ బేసిక్ పాఠశాలలో పీఎం శ్రీ నోడల్ అధికారి డా. టీవీ రామకృష్ణ పర్యవేక్షణలో,ప్రధానోపాధ్యాయులు దాట్ల పద్మజ అధ్యక్షతన అపాస్ అవగాహన సదస్సును నిర్వహించారు.జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పాఠశాల విద్యను మధ్యలోనే నిలిపివేసిన (డ్రాపౌట్స్) విద్యార్థులకు,పదవ తరగతి,ఇంటర్మీడియట్ విద్యను తిరిగి ప్రారంభించేందుకు అపాస్తో మార్గం సుగమం చేయబడుతుందన్నారు.అపాస్ అందించే అవకాశాలపై ఉపాధ్యాయులకు విస్తృత అవగాహన కల్పించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం అన్నారు.టీవీ రామకృష్ణ మాట్లాడుతూ అపాస్ ద్వారా పొందే పదవ తరగతి, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లు రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానమైన గుర్తింపు కలిగి, పై చదువులు, ఉన్నత ఉద్యోగ అవకాశాలు కలిగి ఉంటాయన్నారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఏ వయస్సు వారైనా ఈ అపాస్ లో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఐ కోఆర్డినేటర్ సాయిరాం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**జంగారెడ్డిగూడెం, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి ):** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ జంగారెడ్డిగూడెం పర్యటన సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మండల పరిధిలోని మైసన్నగూడెం గ్రామంలో నూతన సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు.
శ్రీనివాసాపురంలో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు,టీడీపీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు కుక్కల మాధవరావు జనసేన అధ్యక్షులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పౌరుడు ఒకే ఓటు కలిగి ఉండాలి ... తాసిల్దార్ కనకయ్య..



**చిగురుమామిడి ఆగస్టు 27 (మీ వార్త విలేకరి):** దేశంలో ప్రతీ పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉండాలని, రెండు ఓట్లు కలిగి ఉండడం నేరమని తహసిల్దార్ కనకయ్య అన్నారు. చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటర్ల ప్రత్యేక సవరణ (ా×=) కార్యక్రమంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాసిల్దార్ కనకయ్య హాజరై ఓటర్ల జాబితా వివరాలు వెల్లడించి, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ... చట్టప్రకారం దేశంలో ప్రతీ పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉండాలని, రెండు ఓట్లు కలిగి ఉండడం నేరమని స్పష్టం చేశారు. గ్రామంలో డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించామని గ్రామంలో 204 మందికి నాన్ మ్యాపింగ్ ఓట్లు జరిగాయని వీటికి సంబంధించి గ్రామంలో నోటీసులు అందించి సంబంధిత ఓటర్లకు నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులు అందిన వారూ 142 మంది ఆధారాలతో సహా తాసిల్దార్ ముందు హాజరైనరూ సరైన వివరాలు అందించని వారికి, అందుబాటులో లేని వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నేటి నుండి అక్టోబర్ 17 వరకు గ్రామాలలో రోజుకో గ్రామంలో హియరింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

## కోరుకొండ పోలీసులు చాకచక్యంతో గంజాయి కేసులో పట్టుకున్న ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్



**కోరుకొండ ఆగస్టు 27 (మీ వార్త ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది వారి చాకచక్యంతో గంజాయి కేసులో పట్టుకున్న నక్క నాగేంద్ర కుమార్ (21)మర్రి సుధీర్ (20)లను అదుపులోనికి తీసుకొని అరెస్టు చేశామని స్థానిక ఎస్సై రమేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు,నార్త్ జోన్ డీఎస్పీ కుమారి సిహెచ్ జీవనకి అందిన పక్కా సమాచారాన్ని కోరుకొండ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ కి తెలియజేయగా, కోరుకొండ పీఎస్ సిబ్బందితో కలిసి కోరుకొండ మండలం నరసాపురం గ్రామ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహించామని,ఈ క్రమంలో ఇద్దరువ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు పోలీసులు గమనించి పోలీసులను చూసిన వారు అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, కోరుకొండ ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారిపై క్రైమ్ నంబర్ 227/2025, ఎన్డీపీఎస్ చట్టం, 1985లోని సెక్షన్ 8(ఎ) రెడ్ విత్ 20(ఎ)(అఅ)(డీ) కింద నమోదైన కేసులో ముద్దాయిలుగా ఉన్నారని, వారు జగ్గంపేటనివాసులని,
చాలా కాలంగా పోలీసుల కన్నుకప్పితిరుగుతున్నారని తెలిపారు.27. 08. 2026 ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో వారిని అదుపులోకి తీసుకునివారి గత నేర చరిత్రపై కూడా పోలీసులు విచారణ జరిపారన్నారు.నక్క నాగేంద్రకుమార్ తనపై రంగంపేట పోలీస్ స్టేషన్లో దొంగతనానికి సంబంధిన సుమారు 10 కేసులు ఉన్నట్లు తెలిపారు. అలాగే మర్రి సుధీర్ తనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో 2 కేసులు, జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఒక ఎన్డీపీఎస్ కేసు ఉన్నట్లు తెలిపారు.వ్యక్తిగత తనిఖీలో నక్క నాగేంద్ర కుమార్ వద్ద నుండి రూ.300/-మర్రి సుధీర్ వద్ద నుండి రూ.200/- నగదును స్వాధీన పరిచినట్లు తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన కోరుకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిహెచ్ వి రమేష్ ని వారి సిబ్బంది కానిస్టేబుళ్లు డి. సత్తిరెడ్డి, బి రవి కిరణ్, కె.ఎస్. ప్రకాష్ రెడ్డి, ఏం. సుబ్రహ్మణ్యలను నార్త్ జోన్ డీఎస్పీ కుమారి సిహెచ్.జీవన, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తి లు అభినందించారు.

## నెల్లిపాకలో గుర్తుతెలియని యాచకుడి మృతి

**నాలుగు రోజులుగా సెంటర్లో సంచారం.. కాల్వలో విగతజీవిగా గుర్తింపు**

**మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించిన పోలీసులు**



**ఎటపాక, ఆగస్టు 27 (మీ వార్తా** విలేకరినెల్లిపాకలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. నెల్లిపాక సెంటర్ సమీపంలోని జాతీయ రహదారి బైపాస్ పక్కన ఉన్న కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం లేని ఓ గుర్తుతెలియని యాచకుడు గత నాలుగు రోజులుగా నెల్లిపాక సెంటర్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే మృతుడి పేరు, స్వగ్రామం, కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. రోడ్డు పక్కన ఉన్న కాల్వలో వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని కొందరు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎటపాక ఎస్ఐ జి. అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆచూకీ, వివరాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి గుర్తింపు కోసం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## ప్రతి అర్హుడి ఓటు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి



గుర్రంతండా గ్రామంలో 2 కార్యక్రమంపై ఓటరు జాబితా పరిశీలన గుర్రంతండా గ్రామపంచాయతీ గ్రామ సభలో 2 కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలతో కలిసి ఓటరు జాబితాను పరిశీలించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్ ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం ఎన్ని ఓట్లు ఉన్నాయి, ఎన్ని ఓట్లు సక్రమంగా ఉన్నాయి, ఏమైనా ఓట్లు తొలగించబడ్డాయా, ఇతర బూత్లకు ఎన్ని ఓట్లు బదిలీ అయ్యాయి అనే అంశాలపై పూర్తి వివరాలను బీఎల్ఓలు, బీఎల్ఏలను అడిగి తెలుసుకున్నారు. రెండో విడత నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ఏ ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాపాడాలని, ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించి బాధ్యతతో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి సూచించారు.

## కలశ స్థాపనతో ప్రారంభమైన సంతోషిమాత జన్మదిన వేడుకలు



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో త్రయాహ్నికంగా నిర్వహిస్తున్న జన్మదిన వేడుకల్లో భాగంగా మొదటి రోజు బుధవారం కలశ స్థాపనతో పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పూజా మండపంపై గణపతి పూజ పుణ్యాహవాచనం, మంటపారాధన, కంకణ ధారణ, దీక్ష వస్త్రధారణ నిర్వహించారు. ప్రత్యేకంగా జన్మదిన వేడుకల సందర్భంగా రుద్రహోమం, లలిత హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషి మాత దేవాలయ అధ్యక్ష లు బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాష్ కోశాధికారి కొత్త మల్లికార్జున్, దేవాలయ సహాయ అర్చకులు అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎమ్మెల్యే బొలిశెట్టి ఉక్కుపాదం

**కఠిన నిఘా పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ**



**తాడేపల్లిగూడెం ఆగస్టు 27 (మీ వార్త ప్రతినిధి)** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే,కొందరు రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తూ పేదల కడుపుపై కొడుతున్నారని,దీనిపై కఠిన నిఘా పెట్టి రేషన్ మాఫియాను అరికట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంచినీరు, పారిశుద్ధ్యం పై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం సాయంత్రం పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఆశయంతో ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నాయన్నారు. రేషన్ బియ్యం విక్రయించినా,కొనుగోలు చేసినా నేరం అని హెచ్చరించారు. ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని,పారిశు ధ్యంపై అధికారులు ప్రత్యేక ద్రుష్టి సరించాలన్నారు.డ్రైనేజీ, చెరువులు, ఫిల్టర్ బెడ్లపై గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. పీ-4లో లో భాగంగా తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు అండగా నిలిచి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు.తహసీల్దార్ వై. రవికుమార్,ఇంచార్జ్ ఎంపీడీఓ ముప్పిడి వెంకటేశు,జెడ్పీటీసీ వరలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్డి సూరిబాబు,కొణతాల వెంకట్రావు,తోట నిరీక్షణరావు,పొట్ల ఏడుకొండలు, ఎంఈవో-1 ఎం. శ్రీనివాస్, ఎంఈవో-2 టీవీ. రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు దుర్గాభవాని, సుజాత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఇండియా టుడే ర్యాంకింగ్ లో డా.వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి అగ్రస్థానం





**తాడేపల్లిగూడెం ఆగస్టు 27 (మీ వార్త ప్రతినిధి)** ప్రతిష్టాత్మక ఇండియా టుడే-ఎండీఆర్ఏ బెస్ట్ కాలేజెస్ సర్వే-2026లో డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన విశ్వవిద్యాలయాల విభాగంలో దేశంలోనే ప్రథమ స్థానం సాధించింది. జాతీయ స్థాయిలో అన్ని విశ్వవిద్యాలయాల్లో 32వ ర్యాంకు,రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో 3వ ర్యాంకు దక్కించుకుంది. విద్యా ప్రమాణాలు,పరిశోధన, బోధన, ప్లేస్ మెంట్లు తదితర అంశాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు.ఈ ఘనతపై ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు హర్షం వ్యక్తం చేశారు.ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య,ఆధునిక పరిశోధనలు, రైతులకు సాంకేతిక బదిలీలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషికి ఇది జాతీయ గుర్తింపు అని అన్నారు.విశ్వ విద్యాలయాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

## ఘనంగా జనసేన నేత "బోడపాటి" జన్మదిన వేడుకలు..

**మెగా రక్తదాన శిబిరానికి స్పందన..**





**నక్కపల్లి ,ఆగస్టు 27 : (మీ వార్త ప్రతినిధి)** రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు పలువురు ప్రజాప్రతినిధులు జనసేన పార్టీ కార్యకర్తలు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన జనసేన కార్యకర్తలు నాయకులు మధ్య 35 కేజీల కేకును ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జనసేన నాయకులు, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ తోట నగేష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వీర మహిళలు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నాయకులు, మాజీ జీవీఎంసీ కార్పొరేటర్లు, కూటమి నేతలు నడుమ శివ దత్ కట్ చేశారు.
ఈ సందర్భంగా బోడపాటి శివ దత్తు ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ఇవ్వడానికి ముందుకు వచ్చిన యువకులకు పార్టీ శ్రేణులకు శివ దత్తు కృతజ్ఞతలు తెలిపారు. జన్మదినోత్సవ సందర్భంగా భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా మండల పార్టీ నాయకులు ఆకేటి గోవిందరావు, కురం దాసు అప్పలరాజు, పాము గణేశ్వరరావు, స్వామి, రాజు, ఎలమంచిలి చంద్రరావు, కొల్లు గోవిందు తోపాటు పలురు నాయకులు ఉన్నారు.

## పెదన నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీల్లో నూతన నియామకం నేతలు

**పెదన ఆగస్టు 27(మీ వార్త ప్రతినిధి)** పెదన నియోజకవర్గం నుంచి అనుబంధ విభాగాల కమిటీల్లో నూతనముగా నియామకం అయిన నియోజకవర్గ సీనియర్ నాయకులకు మరియు పెద్దలకు హృదయపూర్వక కృతజ్ఞతలు...

.



## గిరిజన విద్యార్థులపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం.

**వైఎస్ఆర్సిపి అనంతగిరి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ.**



**అనంతగిరి,ఆగస్టు 27 ( మీ వార్త** )మారికవలస గురుకుల పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపడం సరికాదని వైఎస్ఆర్సిపి అనంతగిరి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖపట్నం మారికవలస గురుకుల పాఠశాలలో చదువుతున్న 480 మంది గిరిజన విద్యార్థుల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని,చదువు కోసం ఏజెన్సీ ప్రాంతం నుండి వందల కిలోమీటర్ల దూరం నుంచి మారికవలస,గురుకుల పాఠశాలకు వచ్చిన గిరిజన విద్యార్థులను అకస్మాత్తుగా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు.దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ ఇంగ్లీష్ మీడియం,విద్యను అందిస్తున్న పాఠశాలగా మారికవలస,గురుకుల పాఠశాలకు మంచి గుర్తింపు ఉందని తెలిపారు.అలాంటి పాఠశాల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనుల పట్ల కూటమి ప్రభుత్వానికి నిజమైన ప్రేమ,బాధ్యత ఉంటే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.మారికవలస గురుకుల పాఠశాలను యథావిధిగా కొనసాగిస్తూ గిరిజన విద్యార్థులకు అక్కడే నాణ్యమైన విద్య, అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి,గిరిజన శాఖ మంత్రి అయ్యుండి గిరిజనులకు వెన్నుపోటు పొడవడం ఎంతవరకు సమంజసం అన్ని ఆయన మండిపడ్డారు.విద్యార్థుల తల్లితండ్రులను ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పోలీసులను పెట్టి భయభ్రాంతులను గురిచేసి రాత్రికి రాత్రే వేరే ప్రాంతాలకు తరలించడం,అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన విద్యార్థులకు అన్యాయం జరిగేలాగా వ్యవహరించడం ఇది దుర్మార్గపు చర్య అని గిరిజన సమాజానికి సమాధానం చెప్పాలని ఆయన తెలిపారు.

## పోలవరంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**పెదన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**



**గూడూరు ఆగస్టు 27(మీ వార్త ప్రతినిధి)** పోలవరం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పెదన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తోందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రీ-సర్వేకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం శాంప్రసాద్ సొసైటీలో నేతన్న సేవ కింద రూ.25 వేల సాయం అందిన సందర్భంగా నేతన్నలతో కలిసి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, నేతన్నలు పాల్గొన్నారు.ద

## బిజెపి బలోపేతానికి కృషిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం

**బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతల సురేష్**




**విజయవాడ, ఆగస్టు 27 ( మీ వార్త ప్రతినిధి ):** భాజపా రాష్ట్ర ఎస్సిమోర్చా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి విశ్వేశ్వరరావు( విస్సు ) నగరం లోని విజయేశ్వర దేవస్థానం ఆలయ కమిటీ బోర్డ్ మెంబర్ ఎన్నిక కావటం పట్ల ఎస్సిమోర్చా ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేశారు.అయన ప్రమాణ స్వీకారం చేసిన సందర్బంగా భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో గురువారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ ఆధ్వర్యంలో మోర్చా నాయకులు ఘనంగా సత్కరించారు.
ఈ సందర్బంగా పనతల సురేష్ మాట్లాడుతూ పార్టీ ఎప్పటికీ కన్నతల్లితో సమానమని పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తే వారికి సరైన గౌరవం దక్కుతుందని అయన అన్నారు. దీనికి నిదర్శనం విశ్వేశ్వరరావు అని పేర్కొన్నారు.ఎస్సీ మోర్చా కు ఎన్టీఆర్ జిల్లాకు రెండు సార్లు ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన అనుభవమే ఆయన కు దేవుని సేవ చేసుకునే అదృష్టం కలిగిందన్నారు . ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్వల వెంకట సుబ్బయ్య,ఎస్సిమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్, ఎస్సీ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సర్వశుద్ధి రాజు, రాష్ట్ర మోర్చా కార్యాలయ కార్యదర్శి చిన్నా అమర్లపూడి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షర్మిళ ఖాతున్ తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

# కొత్త దనం లేని జగన్ ప్రెస్ మీట్



**విజయవాడ :** వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. ఆ తరువాత రోజు ప్రెస్ మీట్ పెట్టుకుని కొన్ని రకాల స్క్రిప్టులను చూసి మాట్లాడుతున్నారు. అందులో కొత్తదనం ఏమీ కనిపించడం లేదు. అటు తిరిగి ఇటు తిరిగి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం.. అవి తమ హయాంలోనే బాగా అమలు చేశామని చెప్పడం వంటివి మాత్రమే జరుగుతున్నాయి. ఈ వారాంతపు ప్రెస్ మీట్ లో కూడా అదే పరిస్థితి కనిపించింది. బీసీ రిజర్వేషన్ల అంశంపై జగన్మోహన్ రెడ్డి మరోసారి రాజకీయ విమర్శలు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెండు డిప్యూటీ సీఎం పదవులతో పాటు కేబినెట్ లోని 25 మందిలో 11 మంది బీసీలకు ఇచ్చామని గుర్తు చేశారు. 40 శాతం మంత్రి పదవులకు వారికి కేటాయించామని ప్రస్తావించారు. అప్పట్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడితే కోర్టుల ద్వారా చంద్రబాబు అడ్డుకున్నారంటూ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ.. కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో గ్రామాలకు దిగుతోందని ఆరోపించారు. అయితే ఇప్పుడు న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీ రిజర్వేషన్లు 34% కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దానిని స్వాగతించాల్సింది పోయి గతంలో తాను గొప్పగా చేశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఎలా నడుచుకుంది బలహీన వర్గాలకు తెలుసు. జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశాలు అంటేనే ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు ఆసక్తి తగ్గిపోయింది. మెయిన్ మీడియా కంటే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు, రీల్స్ లో, ఇన్స్టాగ్రామ్ లో ఉన్నవారికి ఆసక్తి. ఇప్పుడు జగన్ చేసే వ్యాఖ్యలకు.. ఆయన హయాంలో జరిగిన పరిణామాలను జత పోలుస్తూ మీమ్స్ ఓ రేంజ్ లో వేసుకుంటారు. సోషల్ మీడియా తెరిస్తే అదే పనిగా జగన్ పైనే రీల్స్ కనబడుతూ ఉంటాయి. అందుకే వారాంతపు మీడియా సమావేశాలు మాత్రం బోర్ కొడుతున్నాయి. రాతపూర్వక స్క్రిప్టులు చదవడం తప్ప ప్రజలకు కొత్తగా చెప్పేదేమీ లేకుండా పోతోంది. అది కూడా సొంత అనుబంధ మీడియా ఛానల్ లైవ్ కవరేజ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. జగన్ మీడియా సమావేశాన్ని జనాలు లైట్ తీసుకుంటున్నారు. ఆయన చెప్పిన దాంట్లో విశ్వసనీయత కంటే మరో కోణంలో వెతుకులాట ఎక్కువగా కనిపిస్తోంది. ఇక తెలుసుకోవాల్సింది ఆయన మాత్రమే.

# మంత్రికి పవర్ కట్...



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కొండా ఫ్యామిలీ వైరం తారస్థాయికి చేరిన వేళ.. ఆమెను నేరుగా పదవి నుంచి తప్పించకుండానే, మంత్రిత్వ శాఖలో ఉన్న అధికారాలన్నింటికీ కత్తెర వేసే సరికొత్త ఆపరేషన్ మొదలైంది. ప్రత్యక్షంగా వేటు వేస్తే వచ్చే రాజకీయ నష్టాన్ని నివారిస్తూ, పరిపాలనాపరంగా ఉక్కిరిబిక్కిరి చేసి ఆమే స్వయంగా తప్పుకునేలా లేదా దిగివచ్చేలా చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లక్ష్యంగా కనిపిస్తోంది. పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తాజాగా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, ఆమె తనకు అనుకూలంగా నియమించుకున్న దాదాపు 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో కీలకమైన ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. వీరిని తక్షణమే మాతృశాఖలకు పంపించడంతో పాటు, సచివాలయం, క్షేత్రస్థాయి యంత్రాంగానికి బలమైన సంకేతాలు వెళ్లాయి. ఉన్నతాధికారులు ఇకపై మంత్రి నిర్ణయాల కంటే సీఎంఓ ఆదేశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే పరిస్థితిని తీసుకురావడం ద్వారా శాఖాపరంగా ఆమెను పూర్తిగా డమ్మీ చేసేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుటుంబం బహిరంగంగా విమర్శలు గుప్పించిన తర్వాత, ఆమెపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. అయితే, ఆమెను నేరుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తే ఒక బలమైన బీసీ మహిళా నేతపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే సామాజిక ముద్ర పడే ప్రమాదం ఉంది. ఈ 'బీసీ సెంటిమెంట్' రాజకీయంగా బూమరాంగ్ కాకుండా ఉండటానికే అధిష్టానం తాత్కాలికంగా ఈ పరోక్ష వ్యూహాన్ని ఎంచుకున్నట్టు సమాచారం. నేరుగా వేటు వేయకుండా అధికారాలను నియంత్రించడం ద్వారా.. మంత్రిగా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోలేరు. పరిపాలనాపరంగా, రాజకీయంగా పార్టీలో ఆమె ఒంటరి అవుతుంది. స్వయంగా రాజీనామా చేసేలా మానసిక ఒత్తిడి పెంచడం లేదా అధిష్టానం వద్దకు వచ్చి రాజీపడేలా చేయడం దీని వెనుక వ్యూహంగా ఉంది. మరోవైపు, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ సెటిల్‌మెంట్ల వ్యవహారం చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పాత ఆరోపణలు, సెటిల్‌మెంట్లపై పోలీసులు విచారణను ఒక్కసారిగా వేగవంతం చేశారు. గత కేసులను బయటకు తీసి దర్యాప్తు చేయడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. దీనివల్ల కొండా కుటుంబం కేవలం రాజకీయంగానే కాకుండా, చట్టపరమైన అంశాల్లోనూ పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోతుంది. అవినీతి, అక్రమాల ఆరోపణల చుట్టూ చర్చను తిప్పడం ద్వారా కొండా సురేఖ సామాజిక కోణాన్ని లేదా 'బీసీ కార్డు'ను రాజకీయ రక్షణ కవచంగా వాడుకునే అవకాశాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా మూసివేసింది. ఏ రాజకీయ నాయకుడికైనా అధికారాలు లేని మంత్రి పదవిలో కొనసాగడం చిరాకు తెప్పిస్తుంది. చేతులు కాలకుండా ఆకులు పట్టుకునే చందంగా కాంగ్రెస్ నాయకత్వం వేసిన ఈ ఎత్తుగడ కొండా సురేఖను పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టింది.

అధికారం లేని శాఖను మోస్తూ ఉత్సవ విగ్రహంలా ఉండటమా? లేక పంతం వీడి సీఎం, అధిష్టానం ముందు లొంగిపోవడమా? అన్నది తేల్చుకోవాల్సిన సంకట స్థితిలో కొండా దంపతులు పడ్డారు. పరిపాలనాపరంగా హక్కులను గుల్ల చేస్తూ రాజకీయ పట్టు బిగించే ఈ వ్యూహం తెలంగాణ కాంగ్రెస్‌లో కొండా సురేఖ రాజకీయ భవితవ్యాన్ని ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి

# మీనాక్షి నటరాజన్ చేతులెత్తేసేరా



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించినప్పుడు.. అధికారంలో ఉన్న పార్టీలో చెలరేగుతున్న ఆధిపత్య పోరును, అసమ్మతులను ఆమె అరికడతారని అధిష్టానం, పార్టీ కేడర్ భావించాయి. రాహుల్ గాంధీ బృందంలో అత్యంత కీలక సభ్యురాలిగా, సాదాసీదా జీవితం గడిపే అవినీతి రహిత నాయకురాలిగా ఆమెకున్న గుర్తింపు తెలంగాణలోని ముఠా రాజకీయాలను గాడిలో పెడుతుందని భావించారు. అయితే, ఆచరణలో తెలంగాణ కాంగ్రెస్ నేతల స్వయంప్రతిపత్తి, వర్గ రాజకీయాల ముందు ఏఐసీసీ ప్లానింగ్ పూర్తిగా తేలిపోయిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాంధీ భవన్ వేదికగా జరుగుతున్న ఆధిపత్య పోరును, ముఖ్యమంత్రి వర్గానికి, మిగిలిన సీనియర్ నేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో మీనాక్షి నటరాజన్ వైఖరి అత్యంత మెతకగా ఉందనే అభిప్రాయం బలపడింది. విమర్శలు, వివాదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ సమీక్షలు , అంతర్గత చర్చలు లేదా కమిటీల పేరుతో సమయాన్ని గడపడమే తప్ప .. పార్టీ క్రమశిక్షణను దాటిన బడా నేతలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం ఆమె చేయలేకపోయారు. దీనివల్ల అసమ్మతి నేతలకు ఏఐసీసీ పట్ల భయం లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. అసమ్మతి స్వరాలు పెరిగినప్పుడు రాజీ మార్గాలు వెతకడం వేరు, కఠిన నిర్ణయాలతో పార్టీ లైన్ దాటకుండా చేయడం వేరు. తెలంగాణ కాంగ్రెస్ సంస్కృతికి తగ్గట్లుగా కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడమే ఆమె వైఫల్యంగా కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న పట్టు, అదే సమయంలో కేబినెట్ మంత్రులు , పాత తరం కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను సమన్వయం చేయడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైంది. ఒకవైపు మంత్రుల మధ్య అంతర్గత పోరు, కొండా సురేఖ ఎపిసోడ్ వంటి ఘటనలు మీడియా ముందుకు వచ్చి పార్టీ ప్రతిష్టను దిగజార్చుతున్నా.. కేవలం అధిష్టానానికి నివేదికలు పంపడానికే ఇన్‌ఛార్జ్ పరిమితమయ్యారనే కామెంట్లు వస్తున్నాయి. ఈ అంతర్గత బలహీనతల నడుమ, మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా తెలంగాణలోని ఓ ప్రైవేట్ కేసు వివరాల వల్ల రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించింది. ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద ఎదురు దెబ్బగా మారింది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాష్ట్రంలో గ్రూపు రాజకీయా లను నడిపించడంలో ఆమె అనుభవం సరిపోలేదనే సంకేతాలు పంపాయి. రాజ్యసభ అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఢిల్లీ స్థాయిలోనూ, తెలంగాణ నేతల వద్ద కూడా ఆమె రాజకీయ పరపతి మరింత తగ్గిపోయిందనే విశ్లేషణలు సాగుతున్నాయి. కేవలం మంచి ఇమేజ్ , రాహుల్ గాంధీ ఆశీస్సులు మాత్రమే ప్రాంతీయంగా బలంగా ఉన్న వర్గ రాజకీయాలను నియంత్రించలేవు. తెలంగాణ కాంగ్రెస్ మరింత వివాదాల్లోకి వెళ్లకుండా ఉండాలంటే..

## ఏపీ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా స్ఫూర్తితో4వ వార్షికోత్సవ వేడుక



**కోరుకొండ ఆగస్టు 27 (మీ వార్త ప్రతినిధి)**ఆధ్యాత్మిక విలువలు, సేవా దృక్పథం, మానవతా భావం, సమాజ శ్రేయస్సు అనే మహోన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ఏపీ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ నాలుగవ వార్షికోత్సవ పండుగను ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకంగాఉందని రెవ. పి వి రత్నం, రెవ. చిర్రా ప్రసాద్,బిషప్ డా.నక్కా ఆనంద్ కుమార్,రెవ.ఆర్ రాజ్ కుమార్,రెవ.లాజరస్,లు పేర్కొన్నారు. గురువారం జంబుపట్నం గ్రామంలో బేతస్థ వర్షిప్ సెంటర్ లోనే నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ..గత నాలుగు సంవత్సరాలుగా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సహకారం అభినందనీయమని,క్రైస్తవ విలువల్లోని ప్రేమ, క్షమ, సేవ, సహనం, సమానత్వం వంటివిలువలతోసమాజంలో మరింత విస్తరించాలనే సంకల్పంతో అసోసియేషన్ తన కార్యకలాపాలను కొనసాగిస్తుందన్నారు. మతం, ప్రాంతం, కులం, వర్గం వంటిభేదాలకతీతంగా ప్రతి మనిషిని గౌరవిస్తూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవడం సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి అన్నారు. ఈ నాలుగు సంవత్సరాల్లోఅసోసియేషన్ సాధించిన ప్రగతి వెనుక సంస్థ నిర్వాహకులు, ప్రతినిధులు, సభ్యులు, సేవకులు,శ్రేయోభిలాషులు, దాతలుప్రతిఒక్కరిసహకారం ఎంతో కీలకమైనదని అన్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అసోసియేషన్ తన ప్రత్యేకతనుచాటుకుంటుందన్నారు. పరస్పరసహకారం, సమన్వయం, సోదరభావం ద్వారా మరింత బలమైన సేవా వ్యవస్థను నిర్మించవచ్చనే నమ్మకంతో సంస్థ ముందుకుసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకత్వానికి, నిర్వాహకులకు, సభ్యులకు, సేవకులకు సంస్థ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మండలంలో ఉన్న పలువురు పాస్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోడా. ఇమ్మాన్యేలు వాక్యసందేశం అందించగా రాజానగరం, సీతానగరం మండల ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన..



**కర్నూలు :** శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు. దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది. ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. మొత్తంగా 37 మంది ఉద్యోగుల స్థానిక అంతర్గత బదిలీలతో శ్రీశైలం దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ మార్పుల అనంతరం దేవస్థానం రోజువారీ పరిపాలన, ఉద్యోగుల విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది..!

## జోగిని తలంటిన అధిష్టానం

**విజయవాడ :** మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత జోగి రమేష్ కుటుంబ వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కుటుంబ కలహాలను, వైవాహిక సమస్యలను నేరుగా పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ ద్వారా బయటపెట్టి, దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడంపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. వ్యక్తిగత తప్పులను లేదా కుటుంబ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీ ప్లాట్‌ఫామ్‌ను వాడుకోవడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ తీవ్రంగా దెబ్బతింటోందని తాడేపల్లి వర్గాలు భావిస్తున్నాయి. వివాదం ముదిరి జోగి రమేష్ కోడలు మేఘన స్వయంగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడటంతో ఈ వ్యవహారం మరింత సున్నితంగా మారింది. అత్తారింట్లో తనకు జరిగిన అన్యాయాన్ని, వేధింపులను వివరిస్తూనే.. న్యాయం కోసం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసినా ఫలితం లేకపోయిందని, జగన్ మోహన్ రెడ్డిని కలవడానికి కూడా అవకాశం దక్కలేదని ఆమె బహిరంగంగా వెల్లడించడం పార్టీకి మింగుడుపడటం లేదు. సమాజంలోనూ, చట్టపరంగానూ ఇలాంటి సున్నితమైన కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా బాధితురాలిగా నిలిచే మహిళల వైపే ప్రజా సానుభూతి ఎక్కువగా ఉంటుంది. పైగా, బయటపడిన వీడియోలు కొన్నే, అసలు ఆధారాలు ఇంకా చాలా ఉన్నాయి అని మేఘన హెచ్చరించడంతో ఇది పార్టీకి మరింత డ్యామేజ్ తెచ్చిపెడుతుందనే భయం వైఎస్సార్‌సీపీలో మొదలైంది. ఆరోగ్యపరమైన, వైవాహికపరమైన వైఫల్యాలు తెలిసి కూడా పెళ్లి చేసి జీవితాన్ని నాశనం చేశారనే ఆరోపణలతో పాటు, మత విశ్వాసాలు, కట్న వేధింపుల వ్యవహారాలను కూడా బయటకు లాగడం వల్ల ప్రతిపక్షాలకు మంచి రాజకీయ అస్త్రం దొరికినట్లయింది. ఓవైపు జగన్ సహా పార్టీ కీలక నేతల పేర్లను ఈ వివాదంలోకి లాగడం, మరోవైపు మతపరమైన అంశాలు ప్రజల్లోకి వెళ్లడం పార్టీ సాంప్రదాయ ఓటు బ్యాంకుపై